


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర **రాజముద్ర**
ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | గురువారం | 01-10-2026 | సంపుటి: 3 | సంచిక: 238 | పేజీలు: 8 | వెల: 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | THURSDAY | 01-10-2026 | VOLUME : 3 | ISSUE : 238 | PAGES: 8 | COST: 2/- |



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## సంక్షేమ పథకాలు ఉచితాలు కావు



- 'ఎస్ఐఆర్' పేరు చెప్పి ఓట్లను అక్రమంగా డిలీట్ చేస్తున్నారు
- సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి
- దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరగాలి
- 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్'లో డిప్యూటీ సీఎం భట్టి

2

## శిక్షణతోనే సమర్థ నాయకత్వం



3

- ప్రొబేషనరీ డీఎస్పీలకు డీజీపీ ఆనంద్ దిశానిర్దేశం
- 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో గంటన్నరపాటు ముఖాముఖి
- రోజుకు కనీసం గంట క్రీడలు లేదా వ్యాయామానికి కేటాయించాలి
- 5వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విజేతలకు పతకాలు అందజేత

## మళ్లీ మా ప్రభుత్వం రావడం తథ్యం

- ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరే
- బీజేపీతో పొత్తు ఉండదు.. ఒంటరి పోరే
- బీజేపీ-బీఆర్ఎస్‌ల మధ్య ఎలాంటి అవగాహన లేదు
- ఇండియా టుడే కాంక్లేవ్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



3





### ధైర్యం, దైవం కలగలసిన ప్రాంతం

# సిరిసిల్ల

**సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చిన కేసీఆర్ పాలన**

**కోట్లాది రూపాయల సొమ్ము చేసుకున్న కేసీఆర్ కుటుంబ సభ్యులు**

**పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఉరి సిల్లగా మారింది**

**రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించండి**

**సిరిసిల్ల సభలో సీఎం రేవంత్ రెడ్డి**

**సిరిసిల్ల , సెప్టెంబర్ 30 :**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో దైవ చింతన, నిజాం రజాకార్లపై చేసిన వీరోచిత పోరాటానికి వారసులుగా సిరిసిల్ల ప్రాంత ప్రజలు ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో బుధవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల అంటే సిరులకు నిలయం.. కానీ పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఉరి సిల్లగా మారిందని ఆరోపించారు. మనిషి నాగరికతకు మొదటి అడుగు వస్త్రం. వస్త్ర పరిశ్రమకు అసలైన చిరునామా సిరిసిల్ల అని, వేలాది కుటుంబాలు వస్త్ర పరిశ్రమను నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన చీరలు, అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేయగల నైపుణ్యం ఇక్కడి చేనేత కార్మికుల సొంతమని పేర్కొన్నారు. సిరిసిల్ల ఉరిసిల్లగా మారితే 2009లో చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లు కేకే మహేందర్ రెడ్డి తయారు చేసుకున్న స్థితిలో కేటీఆర్ చేరి 171 ఓట్లతో చావు తప్పి గెలిచారని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల ప్రజలు ఓట్లు వేస్తే అక్రమంగా వేల కోట్లు సంపాదించుకుని ప్రపంచంలోనే ధనిక కుటుంబంగా కేసీఆర్ కుటుంబం ఆవిర్భవించిందని విమర్శించారు.

మిగతా 2వ పేజీలో..

**కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే**

- సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన అభ్యర్థులు

2

## పథకాలు ప్రజలకు చేర్చేది ఉద్యోగులే

- మీ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కరీంనగర్‌లో కలెక్టరేట్ భవన సముదాయం ప్రారంభం

2



## స్వర్ణం సాధించిన చికిత, జాదవ్‌లకు సీఎం అభినందనలు



- మీ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కరీంనగర్‌లో కలెక్టరేట్ భవన సముదాయం ప్రారంభం

2



3

## ఉపాధి పనులు వేగవంతం చేయాలి

- గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు రక్షణగా 'ఉపాధి' పథకం
- వర్క్ ఫ్రమ్ హోమ్ కాదు.. వర్క్ ఫ్రమ్ విలేజ్.. వర్క్ ఫర్ విలేజ్
- తొలిసారిగా 12 వేల మందికి పైగా సర్పంచులతో మంత్రి సీతక్క వీసీ

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు నిరంతరం ఉపాధి కల్పించడంతో పాటు నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అధికారులను, సర్పంచులను ఆదేశించారు.

## జైపూర్ కరెంటును రాజస్థాన్‌కు కట్టబెట్టడమా?

- జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని రద్దు చేయండి
- ఆ విద్యుత్తును తెలంగాణ అవసరాలకు వాడాలి
- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత హరీశ్ రావు బహిరంగ లేఖ

3





## అమ్మకు వైద్యం కోసం.. అర్ధరాత్రి వీల్‌చైర్‌పై 2 కి.మీ.!

- మంచిర్యాల జిల్లా ఆసుపత్రిలో ఐదు గంటలైనా చికిత్స అందలేదని కుమారుడి ఆరోపణ
- తల్లిని వీల్‌చైర్‌పైనే ఎమ్మెల్యే ఇంటికి తీసుకెళ్లిన యువకుడు

4

## కాంగ్రెస్ నిర్లక్ష్యం.. ఎండిన పంటలు



- అన్నదాతలకు అండగా బీజేపీ
- నల్గొండ జిల్లా పర్యటనలో రామచందర్‌రావు

3

## గ్రీన్ ఎనర్జీకి భారీ ఊతం



4

**రూ.1.86 లక్షల కోట్లతో 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-3'**

- 135 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం
- 50 గిగావాట్ అవర్ బ్యాటరీ నిల్వ వ్యవస్థలు
- కేంద్రం నుంచి రూ.54,082 కోట్ల ఆర్థిక సాయం

## అనాలోచిత నిర్ణయాలతో సంక్షోభంలో రైతులు



3

- ఐదు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా
- రైతులకు బీమా రక్షణ లేకుండా చేశారు
- ఎల్ నినోపై కేంద్ర సహాయం కోరాలి
- వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ నీటి అక్రమ తరలింపు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

# స్వర్ణం సాధించిన చికిత, జాదవ్‌లకు సీఎం అభినందనలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 :**
జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడలు2026లో మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీలో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించడమే కాక 2028లో లాస్ ఏంజెల్స్‌లో జరగబోయే ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి అర్హత సాధించిన తెలంగాణ ముద్దుబిడ్డ చికిత తానిపర్తితోపాటు సాహిల్ జాదవ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభాభి నందనలు తెలిపారు. ఆసియా క్రీడల్లో ఒకేరోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చేసిన ఆర్చరీ క్రీడాకారిణి చికిత రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. పెద్దపల్లికి చెందిన చికిత ప్రతిభను గుర్తించి ఆమెను వెన్నంటి ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కోచ్‌లను ముఖ్యమంత్రి అభినందించారు. కాంపౌండ్ ఉమెన్స్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించడంతోపాటు మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సాహిల్ జాదవ్‌తో కలిసి దక్షిణ కొరియాపై విజయం సాధించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్న చికిత పేరు తెలంగాణ క్రీడారంగ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. చికిత నిరంతర సాధన, పట్టుదల, దృఢసంకల్పంతో సాధించిన ఈ విజయం క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

**మంత్రి వాకిటి అభినందనలు**

ఆసియా క్రీడల్లో ఆర్చరీ కాంపౌండ్ టీం ఈవెంట్లో స్వర్ణం సాధించిన క్రీడాకారిణి చికితారావుకు క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభినందనలు తెలియజేశారు. స్వర్ణ పతకాలు సాధించి 2028 లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలంపిక్స్‌కు అర్హత సాధించిన చికితారావు మన తెలంగాణ క్రీడాకారులు అందరికీ గర్వంగా, ఆదర్శంగా నిలబడాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చికిత తండ్రి శ్రీనివాసరావుతో ఫోన్‌లో మాట్లాడి మంత్రి వాకిటి అభినందనలు తెలియజేశారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

- **ప్రచారం, వ్యూహాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 :**

రెండు పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించి ఇతర పార్టీల కంటే ముందంజలో ఉంది. మహబూబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్ స్థానానికి అభ్యర్థిగా టీపీసీసీ మీడియా విభాగాధిపతి, న్యాయవాది సామ రామ్మోహన్ రెడ్డి ఎంపికయ్యారు. అలాగే నల్గొండఖమ్మంవరంగల్ స్థానానికి మాజీ మంత్రి స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఎంపికయ్యారు. వీరిద్దరూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమను అభ్యర్థులుగా ప్రకటించి అవకాశం కల్పించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇద్దరు అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ అత్యంత కీలకమైనందున అర్హులైన ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయాలని సీఎం సూచించారు. ప్రచారం, క్షేత్రస్థాయి వ్యూహాలు, ఓటర్లను ప్రసన్నం చేసుకునే అంశాలపై అభ్యర్థులకు తగిన మార్గదర్శకత్వం చేశారు. వీరితోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కూడా సీఎంను కలిశారు.

# శిక్షణతోనే సమర్థ నాయకత్వం



**హైదరాబాద్, సెప్టెంబరు 30:**
పోలీస్ అధికారుల కెరీర్‌కు శిక్షణే పునాది అని తెలంగాణ డీజీపీ సీ.వి. ఆనంద్ అన్నారు. సమర్థవంతమైన పోలీస్ అధికారులుగా ఎదగాలంటే క్రమశిక్షణ, నిబద్ధత, నాయకత్వ లక్షణాలతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో డీజీపీ బుధవారం ముఖాముఖి నిర్వహించారు. సుమారు గంటన్నరపాటు సాగిన ఈ కార్యక్రమంలో పోలీస్ నాయకత్వం, బాధ్యతలు, నైతికత, ప్రజలతో వ్యవహరించే తీరు తదితర అంశాలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. పదవిలో ఉన్నంత మాత్రాన నాయకత్వం రాదని, నాయకుడికి ప్రత్యేకమైన లక్షణాలు అవసరమని డీజీపీ పేర్కొన్నారు. ధైర్యం, స్పష్టమైన దార్శనికత, సమగ్రత, విలువలు-నైతికత, బృంద స్ఫూర్తి, నిష్పక్షపాత వైఖరి, సమర్థమైన కమ్యూనికేషన్, కష్టపడి పనిచేసే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతతో పాటు వినయం ముఖ్యమైన నాయకత్వ లక్షణాలని వివరించారు. ముఖ్యంగా నైతిక విలువలపై యువ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విధి నిర్వహణలో చేసే చిన్న పొరపాట్లు కూడా భవిష్యత్తులో వారి ప్రతిష్ఠపై ప్రభావం చూపుతాయని చెప్పారు. పోలీస్ సర్వీసులో మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్ ఉండే నేపథ్యంలో తమ ప్రతిష్ఠను కాపాడుకోవడం ప్రతి అధికారికి అత్యంత కీలకమని అన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లపై ప్రొబేషనర్లు అవగాహన పెంచుకోవాలని డీజీపీ సూచించారు. ప్రజలతో వ్యవహరించడం, నేరాల దర్యాప్తు, చట్టాల అమలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో వినియోగించడం వంటి అంశాల్లో సమగ్ర నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. చట్టాలపై పరిజ్ఞానం మాత్రమే మంచి పోలీస్ అధికారిగా తీర్చిదిద్దదని, నాయకత్వం, మానవీయ దృక్పథం, దర్యాప్తు నైపుణ్యం, సాంకేతిక అవగాహన, శారీరక దృఢత్వం, ప్రజలతో సమర్థమైన కమ్యూనికేషన్ కూడా అవసరమని పేర్కొన్నారు. "ప్రజలకు భద్రత కల్పించడం, వారికి సకాలంలో న్యాయం అందేలా చూడటమే పోలీసింగ్ అంతిమ లక్ష్యం" అని డీజీపీ అన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. ప్రొబేషనరీ డీఎస్పీల ప్రొఫెషనల్ కోర్సులో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు కలిపి మొత్తం 112 మంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. సుమారు 10 నెలలపాటు జరిగే కోర్సులో ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణకు సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే పరిస్థితులపై ప్రాక్టికల్ శిక్షణలో భాగంగా కాంబాట్ వ్యాయామాలు, గుర్రపు స్వారీ, ఈత, వివిధ రకాల ఆయుధాల వినియోగంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 క్లస్టర్-సీలో విజేతలకు డీజీపీ పతకాలు, బహుమతులు అందజేశారు. సెప్టెంబరు 28న ప్రారంభమైన మూడు రోజుల పోటీలు బుధవారం ముగిశాయి. బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారుల వరకు 700 మందికి పైగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు ఒత్తిడితో కూడిన విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని డీజీపీ అన్నారు. ప్రతి పోలీస్ అధికారి రోజుకు కనీసం గంటపాటు క్రీడలు లేదా శారీరక వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. పోలీస్ క్రీడలను గతంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించేవారని, ప్రస్తుతం క్లస్టర్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎక్కువమంది పోలీస్ క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీవీఆర్‌ఆర్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐజీపీ (పి&ఎల్) గజరావు భూపాల్, డిప్యూటీ డైరెక్టర్లు చేతన, మురళీధర్, ఇతర సీనియర్ అధికారులు, అకాడమీ సిబ్బంది, ట్రైనీ ప్రొబేషనరీ డీఎస్పీలు పాల్గొన్నారు.

# ధైర్యం, దైవం కలగలసిన ప్రాంతం సిరిసిల్ల

**మొదటిపేజీ తరువాయి**

2009 నుంచి 2023 వరకు అరడజనుసార్లు జరిగిన ఎన్నికలలో కేటీఆర్ గెలిచినప్పటికీ చేనేత కార్మికుల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేదని ప్రశ్నించారు. కార్మికుల గల్ఫ్ వలసలు ఎందుకు ఆగలేదో ప్రజలు ఆలోచించాలన్నారు. గల్ఫ్ వెళ్లిన కార్మికులు అక్కడ ప్రమాదవశాత్తు మరణిస్తే కనీసం శవాలను తెచ్చుకునే పరిస్థితి కూడా లేదని, బీఆర్ఎస్ పాలనలో గల్ఫ్ కార్మికుల కుటుంబాల కోసం ఒక క్షణమైనా ఆలోచన చేయలేదని విమర్శించారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ చేయాలని స్థానిక నాయకులు కోరితే ప్రమాదవశాత్తు విదేశాలలో ఇక్కడి కార్మికులు మరణిస్తే శవాన్ని తేవడంతోపాటు సంబంధిత కుటుంబానికి రూ.5 లక్షల సహాయం అందించే పథకాన్ని ప్రజా ప్రభుత్వం తెచ్చిందన్నారు. 2004, 2006, 2008లలో కరీంనగర్ జిల్లా ప్రజలు కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించారని, అయినా 2009లో పాలమ□రుకు వలస వచ్చారని, ప్రజలను మోసం చేసిన కల్వకుంట్ల కుటుంబం రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపంచారు. గోదావరి జలాలను అడ్డం పెట్టుకుని రవీందర్ రావు, సంతోష్ రావు, తారక రామారావు మానేరు ఇసుకను దోచుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వీటికి సజీవ సాక్ష్యం నేరెళ్ల బాధితులుగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమారి(జగ్జీవన్ రామ్ బిడ్డ)ను ఇక్కడికి తీసుకొస్తే పోలీసులతో నిర్బంధించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మిడ్ మానేరు డ్యాం ముంపులో కొంప పోయిందని కేసీఆర్ కుటుంబ సభ్యులు ఇండ్ల స్థలాలు పొందలేదా అంటూ నిలదీశారు. సిరిసిల్ల ప్రజల ఓట్లు కేటీఆర్‌కు పచ్చ నోట్లుగా మారాయన్నారు. వేములవాడ శివయ్య, భద్రాచలం రామయ్యను మోసం చేసినవాడు కేసీఆర్ ఒక్కడు మాత్రమే అని సీఎం విరుచుపడ్డారు.



**నేతన్నల కోసం రూ.1741 కోట్లు ఖర్చు చేశాం**

వెయ్యి రోజుల ప్రజా పాలనలో రూ.1741 కోట్లు నేత కార్మికుల కోసం ఖర్చు చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. వేములవాడ రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1700 కోట్లు నిధులు మంజూరు చేశామని, నూలు డిపో వేములవాడలో ఏర్పాటు చేశామని, వేములవాడ ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని, ఎమ్మార్వో కార్యాలయం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

**పద్మశాలి బిడ్డను శాసనమండలికి పంపించాలి**

సిరిసిల్లలో మార్పు రాబోతున్నదని, ప్రజల కళ్లలో ఆనందం కనిపిస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రాబోయే శాసనమండలి ఎన్నికలలో ఒక పద్మశాలి బిడ్డను శాసనమండలికి పంపించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలలో సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన అభ్యర్థికి మంత్రివర్గంలో స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మానేరు నది మీద కట్టిన చెక్‌డ్యాంలు కొట్టుకుపోయి కేసీఆర్ ఇంట్లో నోట్ల కట్టలుగా తేలాయన్నారు. కాళేశ్వరం ప్యాకేజీ 9,10, 11,12 పూర్తి చేయకుండా పెండింగ్ పెట్టడం వల్ల ఇక్కడ రైతులకు గోదావరి నీళ్లు చేరలేదని విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే హరీష్ రావు, కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్ రావు మంత్రులు అయ్యారని, అదే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క మంత్రులు అయ్యారని గ్రహించాలని కోరారు.

**కుటుంబ పాలన కావాలో .. ప్రజా పాలన కావాలో ఆలోచించుకోవాలి**

కుటుంబ పాలన కావాలో ప్రజా పాలన కావాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. గత పాలకులు ఎవరికైనా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించారా అంటూ పదేళ్లు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించేందుకు సరిపోలేదా అని ప్రశ్నించారు. గత పాలకులు కనీసం పేదలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఆడపిల్లలకు ఇచ్చే బతుకమ్మ చీరలో కమీషన్ కొట్టేశారని సీఎం ఆరోపించారు. బతుకమ్మ చీరలకు రూ.350 కోట్ల బకాయిలు ప్రజా ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. గత పాలకులు ఇచ్చిన బతుకమ్మ చీరలు ఆడపిల్లలు ఎప్పుడూ కట్టుకోలేదన్నారు. ఈ పండుగకు చిలక పచ్చ చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని చెప్పారు. రేషన్ కార్డులపై రేషన్ షాపుల ద్వారా నేడు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. రైతు భరోసా కింద రూ.36,000 కోట్లు, రుణ మాఫీ కింద రూ.20,614 కోట్లు రైతులకు చెల్లించామని, 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించామని, నేటి పాలనలో శ్రీకాంతచారి తల్లిని మహిళా కమిషన్ సభ్యురాలిగా, చాకలి ఐలమ్మ కుటుంబ సభ్యురాలిని మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించామని వివరించారు. సభలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు ప్రసంగించారు. ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులు సుదర్శన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ రెడ్డి, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, ప్రభుత్వ సలహాదారు సర్కార వేణుగోపాల్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మదన్మోహన్ రావు, లక్ష్మీకాంతరావు, డాక్టర్ సంజయ్, శ్రీ గణేష్, నాగరాజు, కుంభం అనిల్ రెడ్డి, నవీన్ యాదవ్, సంపత్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, డీసీసీ¾ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు కేకే మహేందర్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**రూ.340 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

సిరిసిల్లలో మొత్తం రూ.340 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సిరిసిల్లలో నేతన్న బజార్‌కు, సిరిసిల్లతోపాటు వేములవాడలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.99.40 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. సిరిసిల్ల, వేములవాడలో రెండు ఆర్డీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగిలో నాలుగు తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన్ ప్రారంభించారు. వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్, వేములవాడ, సిరిసిల్లలో రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు శంకుస్థాపన చేశారు.

# పథకాలు ప్రజలకు చేర్చేది ఉద్యోగులే

**మొదటిపేజీ తరువాయి**

**కరీంనగర్, సెప్టెంబర్ 30 :**
పేదలకు సంక్షేమ పథకాలు చేరవేసే ప్రతినిధులు ప్రభుత్వోద్యోగులే అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో బుధవారం పర్యటించిన ముఖ్యమంత్రి కరీంనగర్ కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉద్యోగులే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతినిధులని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేది అధికారులే అని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఉద్యోగుల సమస్యలను మీ సహకారంతో ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నామని, మనం ప్రజలకు సేవలు అందిస్తూనే సమస్యలను పరిష్కరించుకుందామని సీఎం చెప్పారు. అప్పుడే ప్రజలకు మనపై విశ్వాసం బలపడుతుందన్నారు. మీరంతా కష్టపడితేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రికైనా, ప్రధానమంత్రికైనా మంచి పేరు రావాలంటే ఉద్యోగుల సహకారంతోనే సాధ్యమని అన్నారు. ప్రజలకు సేవలు అందించే మీకు మౌలిక వసతులు కల్పించాలనే ఈ భవన సముదాయ నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.944 కోట్లతో పనులను ప్రారంభించుకున్నామని తెలిపారు. అందరి సహకారంతోనే ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. పేదల సమస్యల చిక్కుముడులు విప్పడానికి ఈ కార్యాలయం ఉపయోగపడాలన్నారు. సహాయం కోసం నిస్సహాయంగా వచ్చే వారిలో మన కుటుంబ సభ్యులను చూడండి.. అప్పుడే సహాయం వారికి నూటికి నూరు శాతం న్యాయం జరుగుతుందని, సమస్యలతో వచ్చిన పేదలకు వెంటనే పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. వందల కోట్లు ఖర్చు పెట్టి ప్రాజెక్టులు నిర్మించినా కేంద్రం అనుమతులు ఇవ్వకపోతే ప్రయోజనం ఉండదన్నారు. కొందరు తమ ఢిల్లీ పర్యటనలను లెక్కలేస్తున్నారు.. సమస్యలు పరిష్కరించుకునేందుకు ఎన్నిసార్లైనా కేంద్రాన్ని కలవాల్సిందేనని, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆరు నెలల్లోనే 170 ఎకరాలు డిఫెన్స్ భూములను రాష్ట్ర అభివృద్ధి కోసం బదలాయించేలా చేశామని, బేగంపేట రన్ వే కింద నుంచి రోడ్డు వేసుకునేందుకు అనుమతులు సాధించామని, సిద్ధాంతాలు వేరైనా అభివృద్ధి కోసం ఒకరికొకరం సహకరించుకుంటాం అని స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలను ముందు కార్యక్రమాలను ఎన్నికల సమయంలోనే రాజకీయం చేయాలన్నారు. ఎన్నికలు లేని సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో రూ.944 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించామని, మరికొన్ని పనులకు శంకుస్థాపనలు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.840 కోట్ల నిధులు సాధించామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరిస్తే ముఖ్యమంత్రిగా అభినందించడంలో ఎలాంటి శషభిషలు లేవన్నారు. మరోసారి ఇక్కడికి వచ్చి జిల్లా అభివృద్ధిపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తానన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అక్కడినుంచే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రోజూ 30 నిమిషాలు వ్యాయామానికి కేటాయించాలి

- **'ఖేలో తెలంగాణ' కార్యక్రమం ప్రారంభం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 30:**
పౌరుల్లో ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం క్రీడల శాఖ, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్‌జీ) ఆధ్వర్యంలో ఖేలో తెలంగాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. పౌరులు తమ దైనందిన జీవితంలో శారీరక వ్యాయామాన్ని అంతర్భాగంగా చేసుకోవడాన్ని ప్రోత్సహించడం ద్వారా తెలంగాణను ఆరోగ్యవంతమైన, చురుకైన, ఉత్సాహభరితమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం లక్ష్యం. నడక, పరుగు, యోగా, క్రీడలు, ఇతర ఫిట్‌నెస్ కార్యకలాపాల్లో ప్రజలు క్రమం తప్పకుండా పాల్గొనాలని ఈ ప్రచారం ప్రోత్సహిస్తోంది. ప్రజలందరూ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు శారీరక వ్యాయామానికి కేటాయించాలని క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఎల్బీ స్టేడియంలో బుధవారం జరిగిన 'ఖేలో తెలంగాణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజారోగ్యమే అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన తెలంగాణకు పునాది అని పేర్కొన్నారు. ఫిట్‌నెస్‌ను జీవితాంతం అలవాటుగా చేసుకోవాలని పౌరులను కోరారు. విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, వృద్ధులు, అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తమ కుటుంబాలు, సమాజాన్ని ఆరోగ్యకరమైన జీవనశైలి అవలంబించేలా ప్రేరేపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

**సీఎంకు ఖేలో తెలంగాణ బంధన్ ఛాలెంజ్**

ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మాజీ భారత క్రికెట్ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, శాట్‌జీ చైర్మన్ కె.శివసేన రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సోనిబాలా దేవి, డీజీపీ సి.వి. ఆనంద్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు, బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్, పారా అథ్లెట్ దీప్తి జీవాంజి, షూటర్ ఈషా సింగ్ తదితర ప్రముఖులకు మంత్రి ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు.

# ఉపాధి పనులు వేగవంతం చేయాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 :**
ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు నిరంతరం ఉపాధి కల్పించడంతో పాటు నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అధికారులను, సర్పంచులను ఆదేశించారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా 12 వేల మందికి పైగా సర్పంచులు, సీఈవోలు, డీఆర్డీవోలు, మండల, జిల్లా అధికారులతో సచివాలయం నుంచి ఆమె బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ కూలీల ఆదాయం, వ్యవసాయం, భూగర్భ జలాలు, పశుగ్రాసంపై ఎల్‌నినో ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఉపాధి హామీ పనులను కేవలం ఉపాధి కల్పించే కార్యక్రమంగానే కాక గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు రక్షణ కల్పించేలా, నీటి వనరులను పెంపొందించేలా అమలు చేయాలని సూచించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ కాదు.. వర్క్ ఫ్రమ్ విలేజ్.. వర్క్ ఫర్ విలేజ్ అనే స్ఫూర్తితో సర్పంచులు గ్రామాల్లోనే అందుబాటులో ఉంటూ ప్రజల అవసరాలను గుర్తించాలన్నారు. మన ఊరుమనమే బాగు చేసుకోవాలన్న స్ఫూర్తితో సర్పంచ్ గ్రామ అభివృద్ధికి కథానాయకుడిగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

**రోజుకు కనీసం 6 లక్షల మందికి ఉపాధి**

ప్రతి గ్రామ పంచాయతీలో రోజూ కనీసం 100 నుంచి 150 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కూలీలకు నిరంతరం పని లభించేలా ముందుగానే పనులను గుర్తించి, అంచనాలు సిద్ధం చేయాలి. పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, రోజుకు రూ. 308 వేతనం అందేలా ఉత్పాదక పనులను ప్రణాళిక చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ కనీసం 6 లక్షల మందికి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, గ్రామంలో 18 ఏళ్లు నిండిన అర్హులైన కుటుంబ సభ్యులకు దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంట కుంట.. ప్రతి ఊరికి ఊట కుంట" అనే లక్ష్యంతో నీటి సంరక్షణ పనులు చేపట్టాలన్నారు.

**గ్రామ సభల నిర్ణయాలకే ప్రాధాన్యత**

అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యంతో పనులకు ఆమోదం తీసుకోవాలన్నారు. 2026 అక్టోబర్ నుంచి 2027 జూన్ వరకు చేపట్టాల్సిన పనులను ముందుగానే సిద్ధం చేయాలి. ప్రతి పంచాయతీకి సుమారు రూ. 25 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉపాధి నిధులు వచ్చే అవకాశం ఉన్నందున వాటిని గ్రామాల అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పక్షపాతంతో కొన్ని జిల్లాలకే నిధులు కేటాయించారని, తమ ప్రభుత్వం జనాభా, స్థానిక అవసరాల ప్రాతిపదికన అన్ని జిల్లాలకు సమన్యాయం చేస్తుందని స్పష్టం చేశారు.

**నవంబర్ 19లోపు వీవో భవనాల పూర్తి**

రాష్ట్రంలో ప్రస్తుతం రూ. 204.50 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. వాటితో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, వీవో (V.O) భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. వీవో భవనాలను నవంబర్ 19 లోపు పూర్తి చేయాలని, ప్రతి మహిళా సంఘం భవనం వద్ద స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కింద కమ్యూనిటీ శానిటరీ యూనిట్ ఏర్పాటు చేయాలని సూచించారు.

# సంక్షేమ పథకాలు ఉచితాలు కావు



**కొచ్చి, సెప్టెంబర్ 30 :**

రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను 'ఫ్రీబీస్' (ఉచితాలు)గా చూడకూడదని, అవి నాణ్యమైన మానవ వనరుల తయారీకి ప్రభుత్వం పెడుతున్న పెట్టుబడులని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కొచ్చిలో బుధవారం నిర్వహించిన 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్'లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎన్నికల వ్యవస్థ, ఎస్ఐఆర్, సంక్షేమ పథకాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు, పెట్టుబడులు, కాంగ్రెస్ పార్టీతో తన అనుబంధం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు ఉన్నటువంటి సంబంధాల గురించి వివరంగా మాట్లాడారు. పేదలకు ఇళ్లు, ఉచిత విద్య, మెరుగైన వైద్యం అందించడం ద్వారానే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని భట్టి తెలిపారు. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రాష్ట్ర జీఎస్‌డీపీపై ప్రభావం చూపేలా ఉండాలన్నదే తమ విధానమని అన్నారు. వైద్యం & విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా సాంకేతిక విద్యకు పెద్దపీట వేస్తున్నామని వివరించారు. సంక్షేమం కింద మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో 53 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందన్నారు.

**'ఎస్ఐఆర్' పేరు చెప్పి ఓట్లను అక్రమంగా డిలీట్ చేస్తున్నారు**

సోషల్ మీడియా వేదికల ద్వారా ఏ ఓటర్లు ఏ పార్టీకి మద్దతుగా ఉన్నారో ముందస్తుగా విశ్లేషించి కేంద్రీకృత పద్ధతిలో ఫారమ్7 దరఖాస్తుల ద్వారా ప్రతిపక్ష మద్దతుదారుల పేర్లను జాబితాల నుంచి తొలగిస్తున్నారని భట్టి ఆరోపించారు. 'ఎస్ఐఆర్' పేరు చెప్పి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో దాదాపు 40వేలనుండి 50వేల వరకు ఓట్లను అక్రమంగా డిలీట్ చేస్తున్నారన్నారు. తన సొంత నియోజకవర్గంతోపాటు పొన్నం ప్రభాకర్ వంటి సీనియర్ నాయకులు, పలువురు పోటీదారుల పేర్లను కూడా ఓటర్ల జాబితాలో అనుమానాస్పదంగా ఉంచారని మండిపడ్డారు. సాధారణంగా రెండు వేల నుండి పది వేల స్వల్ప ఓట్ల తేడాతో గెలుపోటములు నిర్ణయమయ్యే నియోజకవర్గాల్లో ఈ తరహా కుట్రలు ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు.

**గెలుపోటముల కంటే వ్యవస్థలపై విశ్వాసమే ముఖ్యం**

'కాంగ్రెస్ గెలిచిన ప్రాంతాల్లో ఎన్నికల సంఘాన్ని ఎందుకు ప్రశ్నించరు' అన్న ప్రశ్నకు స్పందిస్తూ తమకు విపరీతమైన ప్రజాదరణ ఉన్న చోట 30వేలనుండి 40వేల ఓట్లు తొలగించినప్పటికీ మెజారిటీ తగ్గి గెలుపొందుతున్నామని భట్టి వివరించారు. రాజకీయ పార్టీలు ఓడిపోవచ్చు లేదా గెలవవచ్చు కానీ, పౌరులకు రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై విశ్వాసం సడలకుండా చూడటమే ప్రధానమని స్పష్టం చేశారు. 100 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల్లో తాము వేసే ఓటుపై అనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు ఆ సందేహాలను నివృత్తి చేసి పారదర్శకతను నిరూపించుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే ఉందన్నారు. కేంద్రం క్షమాపణ చెప్పి దిగిపోవాలి. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నందుకు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఉప ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడానికి ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన అత్యంత ఆవశ్యకమని ఆయన ఉద్ఘాటించారు. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా చూసి, ఓటర్లలో నమ్మకాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని భట్టి స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో భాగంగా బీజేపీకి లబ్ధి చేకూర్చేలా పలువురు నేతల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని, తిరిగి బ్యాలెట్ పేపర్ల విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, అలాగే ప్రధాని నరేంద్ర మోదీ కూడా దిగిపోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలి**

దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి గణనీయంగా ఆదాయం సమకూరుస్తున్నప్పటికీ తిరిగి వచ్చే వనరుల విషయంలో సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించాల్సిన అవసరం ఉందని భట్టి అన్నారు. జీఎస్టీ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు. జీఎస్టీ పన్నుల రూపంలో రాష్ట్రం నుంచి రూపాయి పన్ను పంపిస్తే కేంద్ర ఇస్తున్నది 43 పైసలు మాత్రమేనని, అదే బిజెపి పాలిత రాష్ట్రమైన బీహార్ కు రెండు రూపాయల వరకు ఇస్తున్నారని ఉదాహరణగా వివరించారు. దేశాన్ని 'రాష్ట్రాల సమాఖ్య'గా గుర్తించి దేశ ఆర్థికాభివృద్ధికి రాష్ట్రాలు అందిస్తున్న సహకారాన్ని పరిగణనలోకి తీసుకుని వనరుల పంపిణీ జరగాలని కోరారు. 'డబుల్ ఇంజిన' ప్రభుత్వాలకు కేంద్రం నుంచి ఎక్కువ ప్రయోజనాలు లభిస్తున్నాయా అన్న ప్రశ్నకు అవునని సమాధానమిచ్చారు.

**శరవేగంగా హైదరాబాద్ అభివృద్ధి**

హైదరాబాద్‌లో లభ్యమయ్యే భారీ టాలెంట్ పూల్, ప్రపంచస్థాయి మౌలిక వసతులు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఫైనాన్షియల్ సిటీ, హైటెక్ సిటీలు తెలంగాణకు ప్రధాన బలాలని భట్టి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతి, రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకోబోయే పాలనాపరమైన నిర్ణయాలు, పెట్టుబడులకు తెలంగాణ ఏ విధంగా అనుకూలమైన ప్రాంతం అనే విషయాలను ఈ సదస్సు వేదికగా ఆయన వివరించారు

**పాత నాయకులకు పిలుపు.. రేవంత్‌తో సఖ్యతగా పనిచేస్తున్నా**

దేశంలో అన్ని వర్గాలను, మతాలను సమైక్యంగా ఉంచి అభివృద్ధి పథంలో నడిపించే విజన్ ఒక్క కాంగ్రెస్‌కే ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. యువ ఎమ్మెల్యేల కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వైఎస్ఆర్ ఐదు రోజుల పాటు పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారని తెలిపారు. ఆ సమయంలోనే తాను ఆయనకు, కాంగ్రెస్ సిద్ధాంతాలకు మరింత దగ్గరయ్యానని చెప్పారు. ముఖ్యమంత్రి పదవి, దళిత నాయకత్వంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ కాంగ్రెస్‌లో పనిచేసే నాయకులను కులం ప్రాతిపదికన తాను చూడనని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీని వీడి ఇతర పార్టీలు పెట్టుకున్న లేదా ఇతర పార్టీలలో చేరిన పాత కాంగ్రెస్ నాయకులందరూ తిరిగి సొంత గూటికి (కాంగ్రెస్‌కు) రావాలని పిలుపునిచ్చారు. పాత కాంగ్రెస్ నాయకులంతా తిరిగి వస్తే దేశాన్ని బలోపేతం చేయడానికి, పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడానికి సహాయపడుతుందన్నారు. అలా వారు తిరిగి వస్తే అత్యంత సంతోషించే వ్యక్తిని తానే అని భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తాను 100 శాతం సఖ్యతతో పనిచేస్తున్నానని, ప్రభుత్వ నిర్ణయాలన్నీ సమష్టి చర్చల ద్వారానే తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సిద్ధాంతాలను అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు సహచర మంత్రులందరం కలిసి పనిచేస్తున్నాం అని భట్టి తెలిపారు

# జైపూర్ కరెంటును రాజస్థాన్‌కు కట్టబెట్టడమా?

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 :**

మంచిర్యాల (జైపూర్) సింగరేణి విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తయ్యే విద్యుత్తును రాజస్థాన్‌కు తరలించే జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసుకుని ఆ విద్యుత్‌ను వంద శాతం తెలంగాణ అవసరాలకే వినియోగించాలని బీఆర్ఎస్ నేత టి.హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎంకు బహిరంగ లేఖ రాశారు. ఒకవైపు కరెంటు లేక పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే మరోవైపు మన రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే విద్యుత్తును ఇతర రాష్ట్రాలకు ధారాదత్తం చేసేందుకు మీరు సిద్ధపడటం ప్రజా వ్యతిరేక చర్య కాక మరేమిటని ప్రశ్నించారు. జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్‌కు కావాల్సిన బొగ్గు మన సింగరేణి గనుల్లోనే ఉందని, నడపడానికి కావాల్సిన నీళ్లు పక్కన ఉన్న గోదావరి నుంచే పుష్కలంగా అందుతాయని తెలిపారు. బొగ్గు, నీళ్లు, స్థలం మనవి.. అలాంటప్పుడు ఇక్కడ కొత్తగా చేపడుతున్న విస్తరణలో 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు కట్టబెట్టేలా జాయింట్ వెంచర్ ఒప్పందం చేసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి అని నిలదీశారు. మన బొగ్గు, మన నీళ్లు, మన ప్రాంతంలో తయారయ్యే కరెంటుపై హక్కు తెలంగాణదే కదా అని అన్నారు. సింగరేణి సంస్థ రాజస్థాన్‌కు చెందిన ఆర్ఆర్‌వీయూఎన్ఎల్ విద్యుత్ సంస్థతో ఇటీవల కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కొత్తగా నిర్మించే థర్మల్ విద్యుత్‌లో 800 మెగావాట్లు రాజస్థాన్‌కు కేటాయిస్తారని, అంతేకాక రాజస్థాన్‌లో 1500 మెగావాట్ల భారీ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధపడతారని, ఇది దాదాపు రూ.22,000 కోట్ల భారీ ప్రాజెక్టు అని తెలిపారు. సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి.. అలాంటి సింగరేణి విద్యుత్‌ను, పెట్టుబడిని రాజస్థాన్ అభివృద్ధికి ఎందుకు మళ్లించాలి అని ప్రశ్నించారు. మన రాష్ట్రమే కరెంటు లేక అల్లాడుతున్న వేళ ఈ తొందరపాటు నిర్ణయం ఎందుకు అని అడిగారు. రాష్ట్ర విభజన తర్వాత విద్యుత్ లోటును అధిగమించేందుకు కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మిస్తే అందులో ఉత్పత్తయ్యే విద్యుత్తును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సరిగ్గా అందించలేకపోతోందని ఎద్దేవా చేశారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పి కనీసం 78 గంటలు కూడా ఇవ్వలేకపోతున్నారన్నారు. ఈ పవర్ హాలిడేలతో రైతులు కన్నీరు పెడుతుంటే పాలనా వైఫల్యాన్ని ఎల్‌నినో మీదకు నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదన్నారు. మీ నిర్వహణ లోపం వల్లే నేడు రాష్ట్రంలోని విద్యుత్ కేంద్రాలు కునారిల్లుతున్నాయని వ్యాఖ్యానించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం నిర్మించిన 4000 మెగావాట్ల యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ ప్లాంటులో నేడు విద్యుత్ ఉత్పత్తి సగానికి పడిపోయిందని, దానికి జీ10, జీ11 నాణ్యత గల బొగ్గు వాడాల్సి ఉండగా నాసిరకమైన జీ13, జీ14 బొగ్గును వాడి బాయిలర్లు దెబ్బతినేలా చేస్తున్నారని ఆ లేఖలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు కొరతతో కొత్తగూడెంలో 800 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయిందని, నిబంధనల ప్రకారం థర్మల్ కేంద్రాల్లో 45 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండాల్సి ఉండగా కనీస ఉత్పత్తి ఉంచకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని చెబుతున్న మీరు విద్యుత్ కేంద్రాల వద్ద ఎందుకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని అడిగారు. ఈ వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ వెళ్తే పోలీసులను పెట్టి అడ్డుకోవడం మీ నియంతృత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్ర విభజన సమయంలో ఎన్‌టీపీసీ ద్వారా 4000 మెగావాట్ల విద్యుత్ ఇస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, 1600 మెగావాట్లు రాష్ట్రానికి ఇస్తామంటే మీ ప్రభుత్వం తిరస్కరించిందని గుర్తు చేశారు. రాష్ట్రానికి ఎలాంటి అదనపు భారం లేకుండా వచ్చే ఈ విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం వద్దు అని ఎందుకు చెప్పిందన్నారు. రాజస్థాన్‌తో చేసుకున్న విద్యుత్ జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలి. జైపూర్‌లో ఉత్పత్తయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను వంద శాతం తెలంగాణే వినియోగించుకునేలా రాష్ట్ర డిస్కంలతోనే అగ్రిమెంట్ చేసుకోవాలి. యాదాద్రి, భద్రాద్రి, కొత్తగూడెం కేంద్రాల్లో బొగ్గు కొరత లేకుండా పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర విభజన హామీ ప్రకారం ఎన్టీపీసీ నుంచి తెలంగాణకు రావాల్సిన విద్యుత్ కోసం తక్షణమే పీపీఏ ఒప్పందం చేసుకొని రాష్ట్రంలోని రైతులు, ప్రజల కరెంటు కష్టాలను తీర్చాలి. ఈ డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించి రాజస్థాన్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని,. లేనిపక్షంలో రైతులు, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని హరీష్‌రావు హెచ్చరించారు.

# మళ్లీ మా ప్రభుత్వం రావడం తథ్యం

**హైదరాబాద్/కొచ్చి, సెప్టెంబర్ 30 :**

తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ధీమా వ్యక్తం చేశారు. కేరళలోని కొచ్చిలో బుధవారం జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం - ఆవిర్భావం నుండి రూపాంతరం అనే అంశంపై కేటీఆర్ ముఖ్య వక్తగా ప్రసంగించారు. మీరు ప్రధాన రాజకీయ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ముఖ్యమంత్రి అభ్యర్థి.. అని యాంకర్ అంటే కేటీఆర్ బదులిస్తూ 'ఖచ్చితంగా కాదు.. రాబోయే ఎన్నికల్లోనూ కేసీఆరే మా ముఖ్యమంత్రి అభ్యర్థి.. రెండేళ్ల తర్వాత మళ్లీ ఆయనే సీఎం పీఠాన్ని అధిరోహిస్తారు.. తదుపరి సదస్సులో కేసీఆరే ముఖ్యమంత్రి హోదాలో ఇక్కడ కూర్చుని మీతో మాట్లాడతారు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ ఊహాగానాలకు ఆయన తెరదించారు. ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకోబోతోందంటూ వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీఆరఎస్‌బీజేపీల మధ్య అంతర్గత అవగాహన ఉందంటూ అధికార పదేపదే ఆరోపిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీఆరఎస్ ఖాతా తెరవలేకపోవడం, పలువురు నేతలు పార్టీని వీడటంతో గులాబీ శ్రేణుల్లో కొంత స్తబ్దత నెలకొంది. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు, విపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు కేటీఆర్ జాతీయ వేదికలపై పార్టీ వైఖరిని స్పష్టంగా ప్రకటించారు.

**కాంగ్రెస్ వాగ్దానాలకు ప్రజలు మోసపోయారు**

మూడేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ ఎన్నో తప్పుడు వాగ్దానాలు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏటీఎంలా ఉండే కార్డులు ఇచ్చింది. తెలంగాణ ప్రజలకు వాళ్లు 420 హామీలు ఇచ్చారు. బంగారం, స్కూటీలు, మహిళలకు నెలకు రూ.2500 సహా 420 హామీలు ఇచ్చారు. మేం కేవలం 1.8 శాతంతో అధికారం కోల్పోయాం. 4 లక్షల ఓట్ల అతి తక్కువ తేడాతో కోల్పోయాం అని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ ప్రజలు గత ప్రభుత్వాన్ని, ప్రత్యేకించి తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి గెలిపించినందుకు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే తెలంగాణ వీధుల్లో తిరుగుబాటు వస్తది అని అన్నారు.

**బీజేపీతో పొత్తుల ప్రసక్తే లేదు**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీఆర్ఎస్‌బీజేపీల మధ్య అంతర్గత అవగాహన ఉందంటూ అధికార కాంగ్రెస్ పదేపదే ఆరోపిస్తోందని కేటీఆర్ తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీఆరఎస్ ఖాతా తెరవలేకపోవడం, పలువురు నేతలు పార్టీని వీడటంతో గులాబీ శ్రేణుల్లో కొంత స్తబ్దత నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు, విపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు కేటీఆర్ జాతీయ వేదికలపై పార్టీ వైఖరిని ఇంత స్పష్టంగా ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, తదుపరి సార్వత్రిక ఎన్నికల లక్ష్యంగా బీఆర్ఎస్ ఒంటరి పోరాటానికి సిద్ధమవుతోందని కేటీఆర్ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల సిద్ధాంతాలు వేర్వేరు ధ్రువాలని, రాజకీయంగా తాము ఆ పార్టీతో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. 'మా పార్టీకి 26 ఏళ్ల చరిత్ర ఉంది.. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మేము ఎన్నడూ బీజేపీతో పొత్తు పెట్టుకోలేదు.. 2014, 2018, అలాగే 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగింది. సిద్ధాంతాలు, పార్టీ డీఎన్ఏ మారనంత వరకు భవిష్యత్తులోనూ ఒంటరి పోరాటమే ఉంటుంది' అని తేల్చిచెప్పారు. 2023 ఎన్నికల తర్వాత అధికారానికి దూరమైనప్పటికీ పార్టీ కేడర్ బలంగా ఉందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ వైపే తిరిగి నిలుస్తారని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# అనాలోచిత నిర్ణయాలతో సంక్షోభంలో రైతులు

**నల్గొండ, సెప్టెంబర్ 30:**

కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, ముందస్తు ప్రణాళిక లేమి, నిర్లక్ష్య వైఖరి కారణంగానే నేడు వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నల్గొండ జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఎండిన పంట పొలాలను, బోర్లపై ఆధారపడి సాగుచేస్తున్న రైతుల దుస్థితిని స్వయంగా పరిశీలించిన అనంతరం నాగార్జునసాగర్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 నుంచి 15 గంటల విద్యుత్ ఇస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అందుతున్నది గరిష్టంగా ఐదు గంటలు మాత్రమేనని రైతులు వాపోతున్నారని తెలిపారు. అది కూడా తీవ్రమైన ట్రిప్పింగ్‌లు, బ్రేక్‌డౌన్లతో సరఫరా అవుతుండటంతో భూగర్భ జలాలు తోడలేక కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ లేక ఒకవైపు పొలాలు ఎండుతుంటే మరోవైపు గ్రామాల్లో ప్రజలు, చిన్నారులు ఫ్యాన్లు తిరగక తీవ్ర ఉక్కపోత, దోమలతో నరక యాతన అనుభవిస్తున్నారని ఫైరయ్యారు. వరంగల్ 'రైతు డిక్లరేషన్' సభలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కంటే మెరుగైన బీమా పథకాన్ని తెస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక రైతులకు కనీస బీమా రక్షణ లేకుండా మోసం చేశారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 నుంచి ప్రీమియం చెల్లించకుండా ఫసల్ బీమాను పక్కనబెట్టగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తూ రైతుల నోట్లో మట్టి కొడుతోందన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావం, ప్రకృతి వైపరీత్యంపై ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని, కర్ణాటక ప్రభుత్వం తరహాలోనే కేంద్ర ప్రభుత్వ సహాయం కోరి కేంద్ర బృందాన్ని రప్పించి పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయించాలని, రైతులకు తక్షణ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరవాసుల తాగునీటి అవసరాలు నాగార్జునసాగర్ నుంచి ఫేజ్1, ఫేజ్2, ఫేజ్3 ద్వారా తీరుతున్నాయని, నగరంలోనూ, పట్టణాల్లోనూ తీవ్ర తాగునీటి ఎద్దడి రాకుండా ఉండాలంటే ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లలో నిల్వ ఉన్న నీటిని వెంటనే కిందికి విడుదల చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల కేటాయింపుల్లో 811 టీఎంసీలలో తెలంగాణ ప్రవాహ ప్రాంతం ఎక్కువగా ఉండి కనీసం 500 టీఎంసీలు రావాల్సి ఉండగా గత కేసీఆర్ ప్రభుత్వం కేవలం 299 టీఎంసీలకే సంతకం పెట్టి తీరని ద్రోహం చేసిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం ఫ్లడ్ వాటర్‌తో పాటు తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన నికర జలాలను తరలించుకుపోతున్న వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని, తెలంగాణ నికర జలాల పరిరక్షణ కోసం బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఇటీవల క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు, రైతుల కష్టాలు, సమస్యలు తెలుసుకునేందుకు తాను స్వయంగా జూరాల ప్రాజెక్టు వద్దకు వెళితే పోలీసులు అడ్డుకున్నారని రామచందర్ రావు మండిపడ్డారు. రైతులకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో అధికారులు అదే రోజు సాయంత్రం కొంత నీటిని విడుదల చేయడంతో ఆ పరివాహక ప్రాంత రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. కేవలం రూ.900 కోట్లతో నెట్టెంపాడు, డిండి, కల్వకుర్తి తదితర చిన్న ప్రాజెక్టుల మరమ్మతులు, డీసిల్టింగ్ పనులు పూర్తి చేసి ఉంటే కృష్ణా పరివాహక ప్రాంతంలో ఇంతటి నీటి కొరత ఉండేది కాదన్నారు. తుంగభద్ర పరిధిలోని ఆర్డీఎస్ (రాజోలిబండ)లో 15 టీఎంసీల సామర్థ్యం ఉంటే పూడికతీయక కేవలం 5 టీఎంసీలకే పరిమితమైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, నాణ్యతా లోపాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన సూచనల ప్రకారం ఆ మూడు బ్యారేజీలకు ఏ విధంగా మరమ్మతులు చేపట్టాలి, వాటిని తిరిగి ఎలా వినియోగంలోకి తీసుకురావాలనే విషయాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెపం మోపే ప్రయత్నం చేయడం హాస్యాస్పదమని రామచందర్ కొట్టిపారేశారు.

## కాంగ్రెస్ నిర్లక్ష్యం.. ఎండిన పంటలు

**నల్గొండ, సెప్టెంబర్ 30 :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను తీవ్రంగా మోసం చేసిందని, వరి పంటలు ఎండిపోవడానికి కారణమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు మండిపడ్డారు. పార్టీ ప్రతినిధి బృందంతో కలిసి ఆయన నల్గొండ జిల్లాలో బుధవారం పర్యటించారు. క్షేత్రస్థాయిలో రైతులను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడమే తమ పర్యటన ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న అన్నదాతలకు బీజేపీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తోరగల్ గ్రామంలో ఎండిపోయిన వరి పంటను పరిశీలించారు. అనంతరం నల్గొండలో నిర్వహించిన సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో రామచందర్ రావు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ
అధినేతగా 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అక్కడ నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. సేవా భావం, స్వచ్ఛత అనేవి విస్తృత ప్రజా ఉద్యమంగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ స్ఫూర్తిని ప్రతి బీజేపీ కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని, సమాజం, దేశ సేవకు అంకితభావంతో పనిచేయాలని కోరారు. అనంతరం రామచందర్ రావు నాగార్జునసాగర్‌కు బయలుదేరారు. అక్కడ పంట నష్టపోయిన రైతులను స్వయంగా కలిసి వారి బాధలను, సమస్యలను అడిగి తెలుసుకుంటామని చెప్పారు.

## అమ్మకు వైద్యం కోసం.. అర్ధరాత్రి వీల్‌చైర్‌పై 2 కి.మీ.!

**మంచిర్యాల, సెప్టెంబర్ 30 :**

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తల్లికి ఆసుపత్రిలో గంటల తరబడి వైద్యం అందలేదంటూ ఓ కుమారుడు వినూత్నంగా నిరసన తెలిపాడు. దిక్కుతోచని స్థితిలో తల్లిని వీల్‌చైర్‌పై కూర్చోబెట్టి అర్ధరాత్రి వేళ సుమారు రెండు కిలోమీటర్ల దూరం తోసుకుంటూ స్థానిక ఎమ్మెల్యే నివాసానికి తీసుకెళ్లాడు. మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన భూక్య రాజ్‌కుమార్ తన తల్లి భూక్య బుజ్జి (55)ని మంగళవారం రాత్రి మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చాడు. కిడ్నీ సంబంధిత సమస్యతో ఆమె ఆరోగ్యం విషమించడంతో అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకొచ్చినట్లు తెలిపాడు. అయితే ఆసుపత్రికి వచ్చిన తర్వాత దాదాపు ఐదు గంటలపాటు బెడ్ కూడా కేటాయించకుండా తన తల్లిని వీల్‌చైర్‌పైనే ఉంచారని రాజ్‌కుమార్ ఆరోపించాడు. చికిత్స అందించాలని పలుమార్లు కోరినా సిబ్బంది స్పందించలేదని, దీనిపై ప్రశ్నించడంతో తనపై దాడికి ప్రయత్నించారని కూడా ఆరోపించాడు.

**దిక్కుతోచక ఎమ్మెల్యే ఇంటికి..**

తల్లి పరిస్థితి చూసి ఆందోళనకు గురైన రాజ్‌కుమార్ చివరకు ఆమెను అదే వీల్‌చైర్‌పై కూర్చోబెట్టి అర్ధరాత్రి వేళ సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమసాగర్‌రావు నివాసానికి తోసుకుంటూ వెళ్లాడు. ఆ సమయంలో ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో అక్కడి సిబ్బందికి తన గోడు చెప్పుకున్నాడు. వారు వెంటనే ఆసుపత్రి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆసుపత్రి ఆరఎంఓ శ్రీధర్ ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని రాజ్‌కుమార్‌తో మాట్లాడారు. భూక్య బుజ్జికి అవసరమైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చిన అనంతరం తల్లీకుమారులను తిరిగి ఆసుపత్రికి తరలించి చికిత్స ప్రారంభించినట్లు సమాచారం. అయితే ఐదు గంటలపాటు వైద్యం అందలేదన్న రాజ్‌కుమార్ ఆరోపణలపై ఆసుపత్రి యాజమాన్యం నుంచి పూర్తి వివరణ వెలువడాల్సి ఉంది.

## సంపాదకీయం



# నేటి నుంచి కొత్త రూల్స్ మీ జేబుపై ఎఫెక్ట్!

**బల్క్ ఎఫ్‌డీల వడ్డీ రేట్లలో పారదర్శకతకు కొత్త నిబంధనలు**

**ఎస్బీఐ బేసిక్ సేవింగ్స్ ఖాతాల నగదు ఉపసంహరణ చార్జీల్లో మార్పు**

**'ఎన్‌పీఎస్ స్వాస్థ్య'తో పెన్షన్ పొదుపులకు ఆరోగ్య రక్షణ అనుసంధానం**

**ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషీన్ల ధరలు 5 నుంచి 8 శాతం వరకు పెరిగే అవకాశం**

**ఎల్పీజీ, ఆస్తి కొనుగోలు నిబంధనలపైనా మార్పులంటూ ప్రచారం.. కొన్ని అంశాల్లో స్పష్టత అవసరం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 :** అక్టోబర్ ఒకటో తేదీ నుంచి బ్యాంకింగ్, పెన్షన్, గృహోపకరణాల ధరలకు సంబంధించిన పలు మార్పులు అమల్లోకి రానున్నాయి. అయితే సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న "అక్టోబర్ ఒకటి నుంచి మారే నిబంధనలు" అన్న జాబితాలోని ప్రతి అంశం కొత్త నిబంధనే కాదు. ముఖ్యంగా ఎఫ్‌డీల మార్పు సాధారణ చిన్న డిపాజిట్లన్నింటికీ కాకుండా ప్రధానంగా రూ.3 కోట్లు, అంతకంటే ఎక్కువ బల్క్ డిపాజిట్లకు సంబంధించినది.

### బల్క్ ఎఫ్‌డీలకు ఒకే రేటు

రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాల ప్రకారం ఒకే బ్యాంకులో ఒకే తేదీన, ఒకే పరిమాణం--కాలపరిమితి కలిగిన బల్క్ ఫిక్స్‌డ్ డిపాజిట్లకు శాఖను బట్టి వేర్వేరు వడ్డీ రేట్లు ఇవ్వకుండా ఏకరీతి పాటించాల్సి ఉంటుంది. బల్క్ డిపాజిట్ల వడ్డీ రేట్లను ప్రతిరోజూ నిర్ణీత సమయంలో బ్యాంకులు బహిరంగంగా వెల్లడించాలి. దీంతో పెద్ద మొత్తాల డిపాజిట్ల విషయంలో పారదర్శకత పెరగనుంది.

### ఎస్బీఐ ఖాతాదారులకు కొత్త చార్జీలు

ఎస్బీఐ బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాలకు అక్టోబర్ ఒకటి నుంచి శాఖల ద్వారా నిర్వహించే సేవా చార్జీల్లో మార్పులు అమల్లోకి వస్తున్నాయి. ఈ ఖాతాల్లో నెలకు కనీసం నాలుగు ఉపసంహరణలు ఉచితంగా ఉండే విధానం ఉంది. పరిమితికి మించిన నగదు ఉపసంహరణలపై రూ.15తోపాటు జీఎస్టీ చార్జీ వర్తించే నిబంధనలు ఉన్నాయి. అక్టోబర్ ఒకటి నుంచి బేసిక్ సేవింగ్స్ ఖాతాల బ్రాంచ్ చార్జీలు సవరించనున్నట్లు ఎస్బీఐ అధికారికంగా పేర్కొంది.

### 'ఎన్‌పీఎస్ స్వాస్థ్య'తో ఆరోగ్య రక్షణ

జాతీయ పెన్షన్ వ్యవస్థలో 'ఎన్‌పీఎస్ స్వాస్థ్య'కు పెన్షన్ నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ సెప్టెంబర్ 18న నిర్వహణ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇందులో ఆరోగ్య అవసరాల కోసం పెన్షన్ పొదుపులను వినియోగించుకునే సదుపాయాలతోపాటు ప్రామాణిక సూపర్ టాప్--అప్ ఆరోగ్య బీమా అనుసంధానం ఉంటుంది. బీమా ప్రీమియం సంబంధిత ఖాతా నుంచి పాక్షిక ఉపసంహరణ రూపంలో చెల్లించే విధానం ఉంది. కనీస ప్రారంభ చందా రూ.25 వేలుగా నిర్ణయించారు.

### ఏసీ, టీవీ ధరలకు రెక్కలు

పండుగల సీజన్ ముంగిట వినియోగదారులకు ధరల షాక్ ఎదురుకానుంది. ఏసీలు, ఎల్ఈడీ టీవీలు, వాషింగ్ మెషీన్లు సహా పలు గృహోపకరణాల ధరలను అక్టోబర్ ఒకటి నుంచి పెంచేందుకు ప్రముఖ తయారీ సంస్థలు సిద్ధమయ్యాయి. మొత్తం మీద 5 నుంచి 8 శాతం వరకు ధరల పెరుగుదల ఉంటుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. రాగి, అల్యూమినియం, స్టీల్, ముడిచమురు ఆధారిత ముడిసరకుల ధరలు, రవాణా వ్యయం, విదేశీ మారకపు ఒడిదుడుకులు ఇందుకు కారణాలుగా పేర్కొంటున్నాయి. అయితే అన్ని కంపెనీలు, అన్ని ఉత్పత్తులపై ఒకే స్థాయిలో ధరలు పెరగవు.




# 'ఓట్ చోరీ'పై ఇండీ కూటమి యాక్షన్ ప్లాన్

- ఎన్నికల సంఘంపై ఇండీ కూటమి కొత్త యాక్షన్ ప్లాన్
- 6న ఈసీ కార్యాలయానికి అన్ని ప్రతిపక్ష ఎంపీల మార్చ్
- అక్టోబర్ 2-8 మధ్య నిరసన కార్యక్రమాలు
- అక్టోబర్, నవంబర్‌లో 5 భారీ ర్యాలీలు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 :** ఎన్నికల సంఘంపై విమర్శలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్ నేపథ్యంలో బుధవారం ఇండీ కూటమి కీలక సమావేశాన్ని నిర్వహించింది. అక్టోబర్ 6న అన్ని ప్రతిపక్ష పార్టీల ఎంపీలు కలిసి కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి మార్చ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఎస్ఐఆర్ వివారం, ఓటర్ల జాబితాలో మార్పులు, ఎన్నికల సంఘం నిర్ణయ ప్రక్రియపై ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఢిల్లీలో మార్చ్‌తో పాటు అక్టోబర్, నవంబర్ నెలల్లో దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. ఓటర్ల హక్కులకు కలుగుతున్న నష్టాన్ని ప్రజలకు వివరించడమే ఈ ర్యాలీలు ముఖ్య లక్ష్యమని ఆయన అన్నారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా పార్లమెంట్ నుంచి వీధి పోరాటాలు, నిరసనలు, దేశవ్యాప్త ర్యాలీలు, సుప్రీంకోర్టు వరకు తమ కార్యాచరణ ఉంటుందని ఇండీ కూటమి ప్రకటించింది. ఇండీ కూటమి నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించి, "ఓట్ చోరీ"పై తమ ఆరోపణల్ని ప్రజల ముందుకు తీసుకెళ్తామని ఖర్గే చెప్పారు. రాజ్యాంగ వ్యవస్థల పనితీరుపై తమ అభ్యంతరాలను వివరించేందుకు అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతితో సమావేశం కోరినట్లు ఖర్గే వెల్లడించారు. ఎన్నికల సంఘం సహా ఇతర రాజ్యాంగ సంస్థలు తమ స్వతంత్రతను కోల్పోతున్నాయని రాష్ట్రపతికి వివరించనున్నట్లు తెలిపారు. SIR, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పెండింగ్ కేసుల్ని త్వరగా విచారించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు ఇండీ కూటమి నిర్ణయించినట్లు ఖర్గే



చెప్పారు. రాహుల్ గాంధీ గత రెండేళ్లుగా ఎన్నికల్లో "ఓట్ చోరీ" గురించి ఆరోపిస్తున్న విషయాన్ని ఖర్గే పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూడా పలు సందర్భాల్లో ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆయన అన్నారు.



# గ్రీన్ ఎనర్జీకి రూ.1.86 లక్షల కోట్ల 'ధార'

- పునరుత్పాదక ఇంధన రంగానికి కేంద్ర కేబినెట్ భారీ ఊతం
- రూ.1,86,405 కోట్లతో 'పీఎం ధార' కార్యక్రమానికి ఆమోదం
- 135 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడమే లక్ష్యం
- 50 గిగావాట్ గంటల బ్యాటరీ విద్యుత్ నిల్వ వ్యవస్థల ఏర్పాటుకు ప్రణాళిక
- రబీ మద్దతు ధరలు, ఢిల్లీ ట్రాఫిక్ వ్యవస్థతో కలిపి రూ.2.79 లక్షల కోట్ల నిర్ణయాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 :** దేశంలో పునరుత్పాదక ఇంధన రంగానికి మరింత ఊతమిచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం భారీ నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి న°ంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం రూ.1,86,405 కోట్లతో 'పీఎం ధార' కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు సమర్థంగా తరలించేందుకు అవసరమైన ప్రసార వ్యవస్థను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. దీని ద్వారా 135 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని గ్రిడ్‌కు అనుసంధానించడంతోపాటు 50 గిగావాట్ గంటల బ్యాటరీ విద్యుత్ నిల్వ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రాజస్థాన్, లద్దాఖ్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను వినియోగ కేంద్రాలకు తరలించేందుకు భారీ ప్రసార లైన్లు, సబ్‌స్టేషన్లు, గ్రిడ్ మౌలిక సదుపాయాలు అవసరమవుతాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిలో ఉండే హెచ్చుతగ్గులను సమతుల్యం చేసేందుకు బ్యాటరీ నిల్వ వ్యవస్థలు కూడా కీలకమని ప్రభుత్వం భావిస్తోంది.

### రైతులు.. గ్రీన్ ఎనర్జీ.. ట్రాఫిక్

ఇదే సమావేశంలో వ్యవసాయం, పునరుత్పాదక ఇంధనం, పట్టణ రవాణాకు సంబంధించిన మూడు కీలక నిర్ణయాలకు కలిపి సుమారు రూ.2.79 లక్షల కోట్ల మేర ఆమోదం తెలిపినట్లు వెల్లడైంది. ఇందులో 'పీఎం ధార'కు రూ.1,86,405 కోట్లు కేటాయించగా, 2027-28 రబీ మార్కెటింగ్ సీజన్‌కు ఆరు ప్రధాన పంటల కనీస మద్దతు ధరల పెంపుతో రైతులకు సుమారు రూ.90,962 కోట్ల మేర ప్రయోజనం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఢిల్లీలో మేధో ఆధారిత ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థకు రూ.1,790 కోట్లు కేటాయించింది. కొత్త మద్దతు ధరల ప్రకారం గోధుమలకు క్వింటాలుకు రూ.2,610, బార్లీకి రూ.2,286, శనగలకు రూ.5,958, మసూర్‌కు రూ.7,390, ఆవాలు-రైప్‌సీడ్‌కు రూ.6,613,



కుసుమలకు రూ.7,215గా నిర్ణయించినట్లు తాజా కేబినెట్ నిర్ణయంపై వెలువడిన నివేదికలు పేర్కొన్నాయి. నూనెగింజలు, పప్పుధాన్యాల వైపు పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో వాటికి తులనాత్మకంగా ఎక్కువ పెంపు ఇచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.

### ఢిల్లీ ట్రాఫిక్‌కు 'స్మార్ట్' చికిత్స

దేశ రాజధానిలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రూ.1,790 కోట్లతో మేధో ఆధారిత ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను అమలు చేయనున్నారు. కృత్రిమ మేధ, స్మార్ట్ సిగ్నలింగ్ వంటి సాంకేతికతలను ఉపయోగించి రద్దీని నియంత్రించడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, రహదారి భద్రతను మెరుగుపరచడం దీని లక్ష్యంగా పేర్కొన్నారు.

# టపాసులకు 'సుప్రీం' టైమ్!

- పూర్తి నిషేధం విధించబోమని సుప్రీంకోర్టు
- రోజంతా ఎక్కడపడితే అక్కడ కాల్చేందుకూ అనుమతి లేదని వ్యాఖ్య
- దీపావళి వేళ నిర్దిష్ట సమయాల్లోనే టపాసులకు అవకాశం
- బేరియం పరీక్షలకు మరింత గడువు.. అక్టోబర్ 15న తదుపరి విచారణ




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 :** దీపావళి వేళ టపాసుల వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశవ్యాప్తంగా టపాసులపై సంపూర్ణ నిషేధం విధించడం, అదే సమయంలో రోజంతా విచ్చలవిడిగా టపాసులు కాల్చేందుకు అనుమతించడం.. ఈ రెండింటికీ తాము అనుకూలం కాదని స్పష్టం చేసింది. పండుగలతో ముడిపడిన ప్రజల మనోభావాలతోపాటు పర్యావరణం, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సమతుల్య విధానం అవసరమని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి. వరాలేల ధర్మాసనం పేర్కొంది. "పూర్తి నిషేధానికీ అంగీకరించం.. 24 గంటలూ టపాసులు కాల్చేందుకూ అనుమతించం'' అని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. రోజంతా టపాసులు పేల్చడం వల్ల వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు, చిన్నారులతోపాటు ఇతరులపైనా తీవ్ర ప్రభావం ఉంటుందని పేర్కొంది. అందువల్ల టపాసులు కాల్చేందుకు నిర్దిష్ట సమయాన్ని నిర్ణయించే విధంగా మధ్యేమార్గాన్ని అన్వేషించాల్సి ఉందని తెలిపింది. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన కొత్తతరం గ్రీన్ టపాసుల విషయంలో ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. శబ్ద పరిమితులు, టపాసుల పరిమాణం, పేలుళ్ల మధ్య వ్యవధి వంటి నిబంధనలు పాటించాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే బేరియం కలిగిన గ్రీన్ టపాసుల అంశంపై ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. వాటివల్ల గాలి నాణ్యతపై పడే ప్రభావాన్ని శాస్త్రీయంగా పరీక్షించాల్సి ఉందని కేంద్రం కోర్టుకు తెలిపింది. బేరియం ప్రభావం, శబ్ద తీవ్రత తదితర అంశాలపై కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, నీరి సహా నిపుణ సంస్థల పరిశీలనకు సుప్రీంకోర్టు అక్టోబర్ 15 వరకు సమయం ఇచ్చింది. ఆ తర్వాత టపాసుల వినియోగానికి సంబంధించిన మరింత స్పష్టమైన నియంత్రణ విధానం వెలువడే అవకాశం ఉంది.

# ఎన్నికల సంఘంపై తప్పుడు ఆరోపణలు సరికాదు

**బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) ను ఓటు దొంగతనంగా చిత్రీకరించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను గుర్తించడం, మరణించిన వారి పేర్లు తొలగించడం, అర్హతలేని నమోదులను పరిశీలించడం వంటి చర్యలు ఎన్నికల జాబితాను సరిచేయడమేనని స్పష్టం చేశారు.చట్టబద్ధత, అర్హత లేని వ్యక్తుల పేర్లను గుర్తించి తొలగించే చర్యలపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, కచ్చితంగా ఉండాలని కోరడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అన్నారు.ఓటమికి గల కారణాలను విశ్లేషించుకోకుండా, రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ వైఖరి మార్చుకుని, ప్రజాస్వామ్య సంస్థల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మండల మైనారిటీ మోర్చా రాష్ట్ర ఈసీ మెంబర్ షరీపుద్దీన్, కార్యదర్శులు మల్లబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, మండల ఉపాధ్యక్షులు పురాణం దివాకర్, కొండా హర్షవర్ధన్, తుపాకుల సంజన, సురేపల్లి అనసూయమ్మ, మండల కార్యదర్శి ధారావత్ వీరు నాయక్, ఓబీసీ మండల అధ్యక్షుడు పిట్టల సూరిబాబు, ఎస్టీ మోర్చా మండల కార్యదర్శి మూడు రమేష్, మండల కార్యదర్శి ఏపూరి సత్యనారాయణ, బీజేపీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేలకొండపల్లిలో ఘనంగా పోషణ మాసం వేడుకలు



**గర్భిణులకు సీమంతం, పిల్లలకు అక్షరాభ్యాసం**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగమణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి సీడీపీఓ కవిత, ఎంపీడీఓ ఎర్రయ్య, తహశీల్దార్ రాంప్రసాద్, ఎంఈఓ చలపతిరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ గీత మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మాతృ, శిశు మరణాలను అరికట్టవచ్చని తెలిపారు. పిల్లలకు మొదటి 1000 రోజులు అత్యంత కీలకమని, ఈ సమయంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం, టీకాలు, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అంగన్‌వాడీ సేవలపై ప్రతి తల్లికి అవగాహన ఉండాలని, పిల్లల ఎదుగుదలలో పోషణ పాత్ర కీలకమని వివరించారు. గర్భిణులకు పండ్లు, పౌష్టికాహారాన్ని అందజేసి సీమంతం నిర్వహించగా, చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలానగర్‌లో 'పౌర హక్కుల దినోత్సవం'..

**బాధితులకు అండగా ఉంటామని అధికారుల హామీ!**




**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలానగర్ తహసీల్దార్ ఆధ్వర్యంలో బుధవారం రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 'పౌర హక్కుల దినోత్సవం' (సివిల్ రైట్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) నాగమణి నేతృత్వంలో నిబంధనల ప్రకారం జరిగిన ఈ కార్యక్రమంలో బాలానగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) మనోహర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, స్థానిక దళిత నాయకులు పాల్గొన్నారు.

**చట్టాలపై అవగాహన.. సమస్యల పరిష్కారం**

ఈ సందర్భంగా ఆర్ఐ నాగమణి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టాలు, పౌర హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దళితులు, వెనుకబడిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అలాగే, బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన సమగ్ర వివరాల నివేదికను వెంటనే అందజేయాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులను ఆమె కోరారు.

**అస్పృశ్యత నివారణే లక్ష్యం**

సమాజంలో అసమానతలు, అస్పృశ్యత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. బాధితులకు తగిన న్యాయం చేయడంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న చట్టపరమైన అవకాశాలపై అధికారుల బృందం స్థానికులకు సంపూర్ణ అవగాహన కల్పించింది.

# మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



**రాజముద్ర న్యూస్ , నేరడిగొండ:** మండల పీఆర్టీయూ తెలంగాణ నూతన కార్యవర్గ సమావేశం బుధవారం మండల కేంద్రంలోని లక్షి గార్డెన్లో నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా రాథోడ్ శ్రీనివాస్ (రోల్ మామడా), ప్రధాన కార్యదర్శిగా జాదవ్ అంబారావు (కుంటాల-బి), ఆర్థిక కార్యదర్శి తాళ్ల పవన్ (తేజపూర్), గౌరవ అధ్యక్షులు ఆర్.ప్రకాష్ (ఈస్పూర్), గౌరవ సలహా దారులు మడావి బాపూరావు (గాజిలి), మండల మహిళా అధ్యక్షురాలు కె.లీలావతి (బుగ్గారం-బి), మండల ఉపాధ్యక్షులుగా పవార్ వినోద్ కుమార్ (కిష్టాపూర్), ఆర్.ధనరాజ్ (దంసతండా), ఆర్.విఠల్ (వెంకటాపూర్), ఎన్.రత్నపాల్ (సేవాదాస్ నగర్), గుణవంతరావు (యాపల్ గూడ), మండల కార్యదర్శులుగా అక్క చంద్రశేఖర్ (బోరిగాం), జి.మనోజ్ కుమార్ (కొరటికల్), బి.చంద్రశేఖర్ (వెంకటాపూర్), శిడం ఈశ్వర్ (వాంకిడి), అక్షయ (ధన్నోర-డి), మహిళా కార్యదర్శి అశ్విని (రాజులతండ), మీడియా కన్వీనర్ అర్జున్ శ్రీరామ్, మండల కార్యదర్శి పి.ఆర్.ప్రసాద్, (కుంటాల కాంప్లెక్స్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షులు రాథోడ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆడే నూర్ సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రా నవీన్ యాదవ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ముజీబ్, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పోచన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలు

- **కల్లూరు మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే**



**రాజముద్ర న్యూస్ , సత్తుపల్లి:** ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమం ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి, పెద్దకోరుకొండి, చెన్నూరు, ఎర్రబోయినపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలతో గ్రామాల్లో, ముఖ్యంగా మహిళల్లో ఆనందం నెలకొందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, తహశీల్దార్, ఎంపీడీఓ, చిన్నకోరుకొండి సర్పంచ్ బుదేటి గీతా నారపురెడ్డి, పెద్దకోరుకొండి సర్పంచ్ దేవవరపు నాగమణి సత్యంబాబు, కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్జునావు, ఉప సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు, లబ్ధిదారులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భారత ఎన్నికల సంఘాన్ని రద్దు చేయాలి

## ఎల్ హెచ్ పి ఎస్ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్




**ఖమ్మం రాజముద్ర న్యూస్:** భారతదేశ ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా, నైతికంగా పూర్తిగా దిగజార్చి, జాతీయ విలువలను అధఃపాతాళానికి నెట్టేస్తూ, ప్రజలను దోచుకుంటూ, దేశ సంపదను కేవలం అదానీ, అంబానీలకే దోచిపెడుతున్న బీజేపీ & నరేంద్ర మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలంటే భారత ఎన్నికల సంఘాన్ని రద్దు చేసి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను పదవి నుంచి డిస్మిస్ చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి (LHPS) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.2023 భారత ఎన్నికల చట్టాన్ని రద్దు చేసి, భారత ప్రజలకు అందుబాటులో ఉండే, పారదర్శకంగా ఉండే నూతన భారత ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేయాలి. భారత ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, అలాగే భారత ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధ్యక్షులు సభ్యులుగా ఉన్న నిష్పక్షపాత ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేస్తేనే భారత ప్రజలకు న్యాయం జరుగుతుందని LHPS రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.ఈ మేరకు లంబాడి హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ భిక్షం నాయక్ ధరావత్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మెరుగైన విద్యా వసతులు కల్పించడం అభినందనీయం



**షాబాద్, రాజముద్ర న్యూస్:** షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలో అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పాఠశాల తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రం, ఎస్హెచ్జి రిసోర్స్ సెంటర్, భవిత కేంద్రం, నూతనంగా నిర్మించిన డైనింగ్ హాళ్లను స్థానిక శాసన సభ్యులు కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించేందుకు సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. నూతన తరగతి గదులు మరియు ఇతర మౌలిక వసతులతో విద్యార్థులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. తాళ్లపల్లి గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న అమెజాన్ సంస్థ ప్రతినిధులకు, గ్రామ పంచాయతీకి ఎమ్మెల్యే కాలే యాదయ్య గారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు శాస్త్ర స్కూల్ విద్యార్థుల ఎంపిక



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** నల్గొండ జిల్లా అనంతారంలో సెప్టెంబర్ 29న నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికల్లో శాస్త్ర స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 కబడ్డీలో మాధురి, సంజన, కృష్ణ, ఖో-ఖోలో వంశీ, రక్షిత ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శాస్త్ర గ్రూప్ చైర్మన్ మైనం చంద్రశేఖర్, డైరెక్టర్లు కరుణారావు, సునీత, ప్రిన్సిపాల్ జహంగీర్ పాషా విద్యార్థులను అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన పీఈటీ శంకర్, ఉపాధ్యాయ బృందాన్ని యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

## కాళ్లు మొక్కుతాం బస్ వేయండి

**ప్రయాణికుల ఆవేదన**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** కాళ్లు మొక్కుతా బస్సు వెయ్యండి అంటూ ఓ ప్రయాణికుడు వికారాబాద్ బస్టాండ్ లో కంట్రోల్ తో ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ నుండి హైదరాబాద్ కు వెళ్లవలసిన సమయంలో గంట సేపైనా బస్సు రాకపోవడంతో విసుకు చెందిన ప్రయాణికులు వికారాబాద్ బస్టాండ్ లోని కంట్రోల్ కాళ్లు మొకడానికి సైతం లెక్క చేయలేని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ కు వెళ్లాలంటే బస్సు లేక గంటల తరబడి ఆగవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ సిబ్బందిని అడిగితే తాండూర్ నుండి బస్సులు వస్తాయి ఆ బస్సు కు వెళ్ళండి అని సమాధానం ఇస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి నెలకొంటే ముఖ్యంగా హైదరాబాద్ కు వికారాబాద్ బస్టాండ్ నుండి వెళ్లాలంటే గంటల తరబడి బస్సు లేకపోవడం చాలా విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులందరూ వికారాబాద్ కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ లో బస్సులు ప్రయాణించే సమస్య నెలకొనడం విచారించదగ్గ విషయం అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో బస్సులు వికారాబాద్ నుండి హైదరాబాద్ కు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# అడ్లూర్ ఎల్లారెడ్డిలో ఉచిత వైద్య శిబిరం

## డాక్టర్ సురేష్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వరంతో వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మలేరియా డెంగ్యూ పరీక్షలు చేశారు. మొత్తం 7 జ్వర కేసులను గుర్తించి, వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. అదేవిధంగా రక్తపోటు, రక్తంలో చక్కెర పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో కొత్తగా 7 హైపర్‌టెన్షన్ కేసులను గుర్తించి, వారికి చికిత్స ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం మరియు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. సురేష్, మెడికల్ ఆఫీసర్, రామారెడ్డి ఏఎన్ఎం రుక్మిణి, ఆశలు సునీత, గౌతమి పాల్గొన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# చిన్న బుగ్గారంలో ఉచిత వైద్య శిబిరం

**రాజముద్ర న్యూస్, నేరడిగొండ:** మండలంలోని చిన్న బుగ్గారం గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రేమలత గ్రామంలోని ప్రజలతో పాటు పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులతో పాటు రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, స్వచ్ఛమైన నీటినే తాగాలని సూచించారు. విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సంతోష్, సౌందర్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్ కుమార్, ఉపాధ్యాయులు సతీశ్, ఆశా కార్యకర్త స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్ టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కొండగర్ల అంజి

**రాజముద్ర న్యూస్ , తాండూర్:** తాండూర్ మండల టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామానికి చెందిన కొండగర్ల అంజి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి నియామకానికి కృషి చేసిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.రఘునాథ్రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్, జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు ఎస్.రవీంద్రరెడ్డితో పాటు తాండూర్ మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అణగారిన వర్గాల గొంతుకగా నిలుస్తానని అన్నారు. వారి హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు.

# సాత్ నంబర్ పాఠశాలలో ఐడీ కార్డుల పంపిణీ

**రాజముద్ర న్యూస్ , నేరడిగొండ(ఇచ్చోడ):** ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం గ్రామ సర్పంచ్ రాథోడ్ రమేష్, ఉప సర్పంచ్ షబ్బీర్ లు ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాథోడ్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, గుర్తింపు కోసం ఐడీ కార్డులు ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఉప్పలచలకలో ఫుడ్ పాయిజన్ కలకలం

## ఆరుగురు విద్యార్థులు అస్వస్థత



**రాజముద్ర న్యూస్ , సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల పరిధిలోని ఉప్పలచలక గ్రామంలోని ప్రభుత్వ యూపీఎస్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో వెంటనే పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో అందించిన మధ్యాహ్న భోజనం నాణ్యతపై అధికారులు పరిశీలించి, ఘటనకు గల కారణాలను వెల్లడించాలని కోరుతున్నారు.

# వికారాబాద్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్ పర్యటన

## మౌలిక వసతులతో పాటు మెరుగైన వాతావరణం కల్పించాలి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ పోలీస్ హౌసింగ్ ఇన్‌ఫ్రాటెక్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తెలంగాణ రాష్ట్ర లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్ బుధవారం వికారాబాద్ జిల్లాలో పర్యటించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా డీజీ కి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్, కొడంగల్ పోలీస్ స్టేషన్, కొడంగల్ సీఐ కార్యాలయం, దుద్యాల పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణ పనులను పరిశీలించి, కొనసాగుతున్న నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఆయా పోలీస్ స్టేషన్లు సీఐ కార్యాలయంలో కొనసాగుతున్న నిర్మాణ పనులు, గదుల ఏర్పాటు, సిబ్బందికి కల్పిస్తున్న మౌలిక వసతులు, కార్యాలయ విభాగాలు, ఇతర సౌకర్యాలతో పాటు వివిధ అంశాలను ఆయన పరిశీలించారు. లా అండ్ ఆర్డర్ డీజీ పోలీస్ సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులతో పాటు మెరుగైన పని వాతావరణం కల్పించే విధంగా భవనాలను రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గదుల అవసరాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేయాలని, అవసరమైన చోట అదనపు సౌకర్యాలు కల్పించాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేసి, నిర్ణీత సమయంలో భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని కూడా ఆయన ఆదేశించారు. భవనాల నిర్మాణంలో ఉపయోగించే మెటీరియల్ నాణ్యత, పనుల పర్యవేక్షణ, విద్యుత్, నీటి సరఫరా, పారిశుధ్యం, సిబ్బంది వినియోగానికి అనువైన గదులు, ఇతర అవసరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లు సౌకర్యవంతంగా భద్రంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ఉండాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులు మెరుగుదలలు చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీఎస్పీ ఎన్. శ్రీనివాస్, సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐలు వెంకట రమణ, శ్రీశైలం, వేణుకుమార్, సత్యనారాయణ, ఆర్ఎస్ఐలు శివ, సిద్దిఖ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ పోలీస్ హౌసింగ్ ఇన్‌ఫ్రాటెక్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు వైబీ శ్రీనివాస్ రావు, ఈఈ బాలాజీ దాస్, డి ఈ ఈ నవీన్ కుమార్, ఏ ఈ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి నుండి ప్రైవేట్ ఆసుపత్రిలకు రోగులను తరలిస్తున్నారని ఆరోపణ




- జిల్లా కేంద్రంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం విచారకరం
- వైద్యం కోసం వచ్చే పేదవారికి ఈ పరిస్థితి ఎదురైతే పరిస్థితి ఏంటి...?

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ప్రభుత్వ ఆసుపత్రికి ఎక్కువగా వచ్చేది సామాన్యమైన పేద ప్రజలు అట్లాంటి వారిని కూడా ప్రైవేటు ఆసుపత్రులకు గురి చేయడం ఇంతవరకు సమంజసమని పలువురు విచారణ వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కువ శాతం సీరియస్ గా ఉన్న పేషంట్లను వికారాబాద్ లోని పలు ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా వైద్యం కోసం వచ్చే సాధారణ ప్రజలను ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేయడం పలు అనుమానాలకు దారితీస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఉన్నతమైన ప్రభుత్వాసుపత్రికి తరలించాలి కానీ స్థానికంగా ఉండే ప్రైవేటు ఆసుపత్రులకు వైద్యం కోసం సాధారణ ప్రజలను తరలించడం ఎంతవరకు సరి అయిందో ఉన్నత అధికారులే ఆలోచించాలని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం కావాలనే ఉద్దేశంతో సాధారణ ప్రజలు డాక్టర్ ఎక్కడ రిఫర్ చేస్తే అక్కడికి వెళ్లడం లేని పరిస్థితుల్లో ప్రాణాపాయస్థితి ఏర్పడే అవకాశం ఉండొచ్చా అనే ఉద్దేశంతో ఆసుపత్రులకు వెళ్లడం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని, ప్రైవేటు ఆసుపత్రికి సంబంధించిన సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రిలో వారి ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు అక్కడ వెయిట్ చేయండి పేషెంట్లను తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ఆసుపత్రిలోని ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటే మండలాలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల యొక్క పరిస్థితి ఏందని పలువురు ప్రశ్నిస్తున్నారు. తనిఖీలు చేయవలసిన అధికారులు ఆస్పత్రి తనిఖీ విషయంలో పేషంట్ల విషయంలో సిబ్బంది విషయంలో సాధారణ ప్రజలకు వైద్యం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పై ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాసుపత్రి నుండి ప్రైవేటు ఆసుపత్రులకు పేషెంట్లను తరలించకుండా అక్కడే వైద్యం అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఇక్కడ పరిష్కారం కానీ ఎడల మరో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు సిద్ధం చేయాలి కానీ ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించకూడదని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆహారంలో వినియోగించే కల్తీ వస్తువులను నివారించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**రాజముద్ర న్యూస్ , ఆసిఫాబాద్:** జిల్లాలోని హోటళ్ళు, బేకరీలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలలో తయారుచేసే ఆహారంలో కల్తీ వస్తువులను వినియోగించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తో కలిసి హాజరై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హోటళ్ళు, బేకరీలు, తినుబండారాల షాపులను ఆహార భద్రత అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, కల్తీ వస్తువులను ఆహారంలో వినియోగించకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యాపారాల అనుమతులు, షాపుల రిజిస్ట్రేషన్లు తనిఖీ చేయాలని, కల్తీ వస్తువులను వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలలో ఆహారం తయారీలో వినియోగించే ముడి పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు, విష బాధ ఘటనలను నివారించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. తనిఖీల సమయంలో లభించిన వస్తువులు, ఆయా వ్యాపార సంస్థల వివరాలు పత్రికలలో వచ్చే విధంగా ఫుడ్ ఇన్స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ అధికారి వాసు రావు, ఫుడ్ ఇన్స్పెక్టర్ మహేందర్, వైద్యులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుడికి ఘన వీడ్కోలు



**రాజముద్ర న్యూస్ , తాండూర్:** మండలంలోని మాదారం గ్రామపంచాయతీలో పంచాయతీ కార్మికుడిగా సుదీర్ఘ కాలం విధులు నిర్వహించిన చిదురాల రాజిరెడ్డికి బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మీనా దంపతులు రాజిరెడ్డికి నూతన వస్త్రాలు అందించి శాలువా కప్పి సత్కరించారు. సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీడీఓ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉమ్మడి గ్రామపంచాయతీ నుంచి నేటి మాదారం గ్రామపంచాయతీ వరకు సుమారు 40 ఏళ్లుగా రాజిరెడ్డి నిరంతరం సేవలందించారని తెలిపారు. ప్రభుత్వం అందించే చేయూత పింఛన్ ద్వారా ఆయనకు సహాయం అందిస్తూ ఉద్యోగ విరమణ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహించిన రాజిరెడ్డి శేష జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం నుంచి అందే సహాయ సహకారాలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు కూడా తమవంతు సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, గ్రామ ప్రజలు రాజిరెడ్డిని ఘనంగా సన్మానించారు. పలువురు తమవంతుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సర్పంచ్ పరపతిరావు, మాదారం ఉపసర్పంచ్ సూరం దామోదర్రెడ్డి, వార్డు సభ్యులు గోదెల లక్ష్మి , గొర్లపల్లి బాణేష్, కత్తెర్ల రవికుమార్, గుండేటి లక్ష్మి , సౌమ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# తెలుగోడికి రెస్ట్..

## 'దేశవాళీ కింగ్'కు ఛాన్స్!

### వెస్టిండీస్‌తో రెండో వన్డేలో భారత్ తుది జట్టులో ఒక్క మార్పు

### నితీశ్‌కుమార్ రెడ్డి స్థానంలో ఆకిబ్ నబీకి అరంగేట్రం

**గువాహటి, సెప్టెంబర్ 30** : వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో వన్డేలో టీమిండియా తుది జట్టులో ఆసక్తికర మార్పు చోటుచేసుకుంది. తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి స్థానంలో జమ్మూ కశ్మీర్‌కు చెందిన ఆకిబ్ నబీకి అవకాశం దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో వరుసగా సత్తాచాటిన నబీకి ఇదే తొలి అంతర్జాతీయ వన్డే. మ్యాచ్‌కు ముందు కేఎల్ రాహుల్ అతడికి భారత జట్టు క్యాప్‌ను అందజేశారు. గువాహటిలోని బర్సాపరా క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలి వన్డేతో పోలిస్తే తుది జట్టులో భారత్ ఒక్క మార్పే చేసింది. నితీశ్‌కుమార్ రెడ్డి స్థానంలో ఆకిబ్ నబీని తీసుకున్నట్లు గిల్ వెల్లడించాడు.

### దేశవాళీలో వికెట్ల వేట.. ఇప్పుడు టీమిండియాలోకి

దేశవాళీ క్రికెట్‌లో ఆకిబ్ నబీ నిలకడైన ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. రెండు రంజీ సీజన్లలో కలిపి 104 వికెట్లు పడగొట్టిన నబీ.. 29 ఏళ్ల వయసులో భారత జట్టు తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. పిచ్‌పై గత మ్యాచ్‌తో పోలిస్తే కాస్త ఎక్కువ పచ్చిక ఉందని, కొన్ని ప్రాంతాల్లో ప్యాచీగా కనిపిస్తోందని టాస్ సందర్భంగా గిల్ తెలిపాడు. ఆరంభంలో పేసర్లకు కొంత సహకారం లభించే అవకాశం ఉందని పేర్కొన్నాడు. గువాహటిలో వేడి, తేమ కూడా ఫాస్ట్ బౌలర్లకు సవాల్‌గా మారుతుందని అభిప్రాయపడ్డాడు.

### సిరీస్‌పై భారత్ కన్ను

తొలి వన్డేలో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. విరాట్ కోహ్లీ అజేయంగా 139 పరుగులు చేయగా, శుభ్‌మన్ గిల్ 110 పరుగులతో మెరిశాడు. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది. రెండో మ్యాచ్‌లోనూ గెలిస్తే మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ భారత్ సొంతమవుతుంది.

**భారత్ తుది జట్టు:** రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్, నమన్ ధీర్, రవీంద్ర జడేజా, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ.

# ఆసియాడ్‌లో భారత్‌కు 'గోల్డ్ రష్'

ఒక్కరోజే నాలుగు స్వర్ణాలు | ఆర్చరీలో భారత్ క్లీన్‌స్వీప్

- మహిళల, మిక్స్‌డ్, పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగాల్లో పసిడి పంట
- ట్రాప్ మిక్స్‌డ్ షూటింగ్‌లో నీరూ ధండా-కైనన్ చెనాయ్ జోడీకి స్వర్ణం
- మహిళల కాంపౌండ్ ఫైనల్లో 238 పాయింట్లతో ప్రపంచ రికార్డు సమం
- రెండు స్వర్ణాలతో మెరిసిన తెలంగాణ ఆర్చర్ చికితా తనిపర్తి






**ఆయిచి-నగోయా, సెప్టెంబర్ 30** : ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు బుధవారం పసిడి పంట పండించారు. ఆర్చరీలో మూడు, షూటింగ్‌లో ఒకటి చొప్పున ఒకేరోజు నాలుగు స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. మహిళల కాంపౌండ్ టీమ్, కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్, పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగాల్లో భారత ఆర్చర్లు స్వర్ణాలను ఊడ్చేయగా.. ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ షూటింగ్‌లో నీరూ ధండా-కైనన్ చెనాయ్ జోడీ పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.



### ప్రపంచ రికార్డును సమం చేస్తూ పసిడి

మహిళల కాంపౌండ్ టీమ్ ఫైనల్లో జ్యోతి సురేఖ వెన్నం, పృథికా ప్రదీప్, చికితా తనిపర్తితో కూడిన భారత జట్టు చైనాను 238-234తో ఓడించి స్వర్ణం సాధించింది. 238 పాయింట్లతో ప్రపంచ రికార్డును సమం చేసిన భారత మహిళలు.. హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో సాధించిన టైటిల్‌ను నిలబెట్టుకున్నారు. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో చికితా తనిపర్తి-సాహిల్ జాదవ్ జోడీ ఉత్కంఠ పోరులో దక్షిణ కొరియాను మట్టికరిపించింది. నిర్ణీత రౌండ్ల తర్వాత 157-157తో స్కోరు సమం కావడంతో షూటాఫ్ నిర్వహించారు. ఇందులో చికితా, సాహిల్ చెరో 10 పాయింట్లు సాధించగా.. కొరియా చివరి బాణం 9 పాయింట్లకే పరిమితమైంది. ఈ విజయంతో భారత్‌కు స్వర్ణంతోపాటు 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ కోటా కూడా దక్కింది. పురుషుల కాంపౌండ్ టీమ్‌లో కుశాల్ దలాల్, సాహిల్ జాదవ్, గణేశ్ మణిరత్నంతో కూడిన భారత జట్టు చైనాపై 238--237తో ఒక్క పాయింట్ తేడాతో విజయం సాధించింది. దీంతో మహిళలు, మిక్స్‌డ్, పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగాల్లో మూడు స్వర్ణాలనూ భారత్ క్లీన్‌స్వీప్ చేసింది.

### షూటింగ్‌లోనూ పసిడి గురి

ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ షూటింగ్‌లో నీరూ ధండా--కైనన్ చెనాయ్ జోడీ 34 పాయింట్లతో స్వర్ణం సాధించింది. ఖతార్ 32 పాయింట్లతో రజతం, చైనా 23 పాయింట్లతో కాంస్యం దక్కించుకున్నాయి. తొలి సిరీస్‌లో వెనుకబడిన భారత జోడీ ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుని పసిడిని చేజిక్కించుకుంది. 34 పాయింట్ల ప్రదర్శనతో ఆసియా రికార్డును కూడా బద్దలు కొట్టింది. నీరూ ధండాకు ఈ క్రీడల్లో ఇది రెండో స్వర్ణం, మూడో పతకం.

### రెండు స్వర్ణాలతో తెలంగాణ బిడ్డ చికిత

మహిళల కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణాలు సాధించిన తెలంగాణకు చెందిన చికితా తనిపర్తి ఒకేరోజు రెండు పసిడి పతకాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల జట్టులో ప్రపంచ రికార్డు స్కోరును సమం చేయడంలో భాగస్వామి కావడంతోపాటు.. మిక్స్‌డ్ టీమ్‌లో ఒత్తిడితో కూడిన షూటాఫ్‌లో 10 పాయింట్ల బాణంతో విజయాన్ని ఖాయం చేసింది. రాశ్రీఎఎజూఅఎం

చికిత సాధించిన రెండు స్వర్ణాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపినట్లు మీరు అందించిన ప్రకటన పేర్కొంటోంది. ఆమె పట్టుదల, సాధన యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని ప్రశంసిస్తూ.. తల్లిదండ్రులు, కోచ్‌లకూ అభినందనలు తెలిపారు.



# కొత్త శకం మొదలు

## బీసీసీఐ చీఫ్ సెలెక్టర్‌గా దిగ్గజ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా!

### అజిత్ అగార్కర్ స్థానంలో తాత్కాలిక సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు

**న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 30** : భారత క్రికెట్‌లో పురుషుల జాతీయ సెలెక్షన్ కమిటీకి సంబంధించి అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. చీఫ్ సెలెక్టర్ పదవి నుంచి అజిత్ అగార్కర్ తప్పుకోవడంతో, నలుగురు సభ్యుల జాతీయ సెలెక్షన్ కమిటీకి తాత్కాలిక అధిపతిగా భారత మాజీ దిగ్గజ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా బాధ్యతలు చేపట్టారు. రాబోయే రోజుల్లో ఆయననే పూర్తిస్థాయి చీఫ్ సెలెక్టర్‌గా బీసీసీఐ నియమించే అవకాశం ఉన్నట్లు క్రికెట్ వర్గాల ద్వారా తెలుస్తోంది. వెస్టిండీస్‌తో రెండో వన్డే కోసం భారత జట్టు గువాహటికి చేరుకున్న వేళ, టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ జాతీయ సెలెక్షన్ కమిటీతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. బర్సాపరా స్టేడియం వేదికగా జరిగిన ఈ భేటీలో సెలెక్టర్లు ప్రజ్ఞాన్ ఓజా, శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్పీ సింగ్ పాల్గొన్నారు. సాధారణంగా ద్వైపాక్షిక సిరీస్‌ల సమయంలో నలుగురు సెలెక్టర్లు ఒకేసారి జట్టుతో ఉండటం అరుదు కాగా, రాబోయే న్యూజిలాండ్ పర్యటనకు జట్ల ఎంపిక మరియు ఆటగాళ్ల పనిభారం (వర్క్‌లోడ్) నిర్వహణపై వీరంతా తీవ్రంగా చర్చించినట్లు సమాచారం. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 27 వరకు భారత జట్టు న్యూజిలాండ్‌లో విస్తృతంగా పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా 5 టీ20లు, 5 వన్డేలు మరియు 2 టెస్టు మ్యాచ్‌లను టీమిండియా ఆడనుంది. అక్టోబర్ 22న క్రైస్ట్‌చర్చ్‌లో తొలి టీ20తో ఈ సిరీస్ ప్రారంభం కానుండగా, అక్టోబర్ 24 నుంచి నవంబర్ 10 వరకు ఇండియా 'ఏ' జట్టు కూడా న్యూజిలాండ్‌లో 3 నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లను ఆడనుంది. రాబోయే 2027 వన్డే ప్రపంచకప్ దృష్ట్యా ఈ పర్యటన అత్యంత కీలకం కానున్న నేపథ్యంలో, ప్రజ్ఞాన్ ఓజా సారథ్యంలోని నూతన సెలెక్షన్ కమిటీ నిర్ణయాలు భారత క్రికెట్ భవిష్యత్తును దిశానిర్దేశం చేయనున్నాయి.



# సెమీస్‌కూ 'వరుణ' గండం?

## మ్యాచ్ రద్దయితే భారత్ ఫైనల్‌కు!

### అక్టోబర్ ఒకటిన శ్రీలంకతో టీమిండియా సెమీఫైనల్ పోరు






**నిషిన్, సెప్టెంబర్ 30** : ఆయిచి-నగోయా ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌ను వరుణుడు వెంటాడుతున్నాడు. నాలుగు క్వార్టర్ ఫైనల్స్ కూడా వర్షం కారణంగా ఒక్క బంతి పడకుండానే రద్దయ్యాయి. దీంతో టోర్నమెంట్‌లో ఉన్నత సీడింగ్ ఆధారంగా భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ సెమీఫైనల్‌కు చేరాయి. అక్టోబర్ ఒకటిన జరిగే సెమీస్‌లో భారత్-శ్రీలంక, పాకిస్థాన్-బంగ్లాదేశ్ తలపడనున్నట్లు ఐసీసీ ధ్రువీకరించింది. భారత్-అఫ్గానిస్థాన్ క్వార్టర్ ఫైనల్ భారీ వర్షంతో రద్దవడంతో ఉన్నత సీడింగ్ కలిగిన టీమిండియా సెమీస్‌కు చేరింది. శ్రీలంక--నేపాల్ మ్యాచ్‌కూ ఇదే పరిస్థితి ఎదురవగా శ్రీలంక ముందంజ వేసింది. పాకిస్థాన్-హాంకాంగ్, బంగ్లాదేశ్-మలేషియా మ్యాచ్‌లు కూడా వర్షార్పణం కావడంతో ఉన్నత సీడింగ్ కలిగిన పాకిస్థాన్, బంగ్లాదేశ్ సెమీస్ బెర్తులు దక్కించుకున్నాయి.

### రద్దయితే భారత్‌కే ఫైనల్ బెర్త్

నిషిన్‌లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో గురువారం మధ్యాహ్నం స్థానిక కాలమానం ప్రకారం 2 గంటలకు భారత్-శ్రీలంక సెమీఫైనల్ జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. వర్షం లేదా మైదానం పరిస్థితుల కారణంగా సెమీఫైనల్‌లో ఫలితం సాధ్యం కాకపోతే టోర్నమెంట్ సీడింగ్ నిబంధన భారత్‌కు అనుకూలంగా మారనుంది. శ్రీలంక కంటే ఉన్నత సీడింగ్ కలిగిన భారత్ ఫైనల్‌కు చేరుతుంది. క్వార్టర్ ఫైనల్స్‌లోనూ ఇదే నిబంధన ఆధారంగా నాలుగు జట్లు ముందంజ వేశాయి.

### ఫైనల్‌కు మాత్రం కొత్త రూల్

అయితే ఈసారి ఫైనల్ విషయంలో కీలక మార్పు ఉంది. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో భారత్-అఫ్గానిస్థాన్ ఫైనల్ వర్షంతో రద్దవడంతో ఉన్నత ర్యాంకింగ్ ఆధారంగా భారత్‌కు స్వర్ణం దక్కింది. 2026లో మాత్రం ఫైనల్ పూర్తిగా వర్షార్పణమైతే ర్యాంకింగ్ ఆధారంగా విజేతను నిర్ణయించరు. ఇద్దరు ఫైనలిస్టులకు సంయుక్తంగా స్వర్ణ పతకం అందించనున్నట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఫైనల్‌కు రిజర్వ్ డే కూడా లేదు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో ఉన్న భారత్ మరోసారి స్వర్ణాన్ని నిలబెట్టుకునేందుకు సిద్ధమవుతోంది. అయితే ముందుగా శ్రీలంకతో సెమీఫైనల్ అడ్డంకిని దాటాల్సి ఉంది.



# ఊర్వశి రౌతేలా వర్సెస్ ఏఐ కంపెనీ

# రూ.7 వేల కోట్ల దావా

## సీఈఓ ఘాటు కౌంటర్‌తో రచ్చ!

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా పేరు ఇప్పుడు సినిమాల కంటే ఓ అంతర్జాతీయ టెక్ వివాదంతో హాట్ టాపిక్‌గా మారింది. లాస్ ఏంజెల్స్‌కు చెందిన ఓ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఊర్వశి బృందం ప్రకటించింది. తన అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలు, వీడియోలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించారనేది ఆమె బృందం ఆరోపణ. ఈ వ్యవహారంలో నష్టపరిహారంగా సుమారు రూ.7,000 కోట్లు కోరుతున్నట్లు తాజాగా వెల్లడించింది..ఊర్వశి రౌతేలా బృందం సోషల్ మీడియాలో చేసిన ప్రకటనతో ఈ వివాదం వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఊర్వశి బృందం ఏఐ సంస్థలకు గట్టి హెచ్చరిక చేసింది. ఎవరైనా తమ సొంత ఏఐ సంస్థను ఏర్పాటు చేసుకోవచ్చని, తమ బ్రాండ్‌ను అభివృద్ధి చేసుకోవచ్చని.. అయితే అనుమతి లేకుండా ఊర్వశి రౌతేలా పేరు, గుర్తింపు, చిత్రాలను తమ వ్యాపార ప్రయోజనాల్లో ఉపయోగించకూడదని స్పష్టం చేసింది.ప్రత్యేకంగా సెలబ్రిటీల పేరు, రూపం, వీడియోలు, డిజిటల్ గుర్తింపును ఏఐ ఆధారిత వాణిజ్య కార్యకలాపాల్లో ఉపయోగించే విషయంలో అనుమతి, హక్కులు వంటి అంశాలు ఎంత కీలకమో ఈ వివాదం మరోసారి చర్చకు తెచ్చింది.మరోవైపు ఊర్వశి బృందం చేసిన ఆరోపణలపై సంబంధిత ఏఐ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ షీరాజ్ హసన్ స్పందించారు. రూ.7,000 కోట్ల క్లెయిమ్‌ను ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. ఊర్వశి గతంలో తమ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూను ప్రస్తావిస్తూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బాలీవుడ్ భవిష్యత్తుపై ఆమె చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తుచేశారు. ఆ ఇంటర్వ్యూలో ఏఐ వల్ల బాలీవుడ్ ఎదుర్కొంటున్న మార్పులపై ఊర్వశిని ప్రశ్నించగా.. ఆమె సమాధానంపై ఇప్పుడు షీరాజ్ హసన్ స్పందించారు. తమ సంస్థ ఆమె నోట మాటలు చెప్పించలేదని, ఏఐ, వినోద రంగ భవిష్యత్తు గురించి మాట్లాడే ముందు టెక్నాలజీపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు.వినోద రంగ భవిష్యత్తు ఏఐ సినిమాలు, డిజిటల్ నటీనటులు, వర్చువల్ పాత్రల వైపు సాగుతుందని షీరాజ్ హసన్ తన స్పందనలో పేర్కొన్నారు. వయసు పెరగని డిజిటల్ పాత్రలు, అనేక భాషల్లో పనిచేసే వర్చువల్ స్టార్స్ వంటి సాంకేతిక పరిణామాలు రానున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.అయితే ఈ స్పందనకు సంబంధించి ఊర్వశి బృందం నుంచి తదుపరి అధికారిక సమాధానం వెలువడిందా అనే దానిపై ప్రస్తుతం స్పష్టత లేదు. దీంతో ఇరు వర్గాల ప్రకటనలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి.

## తప్పు సినిమాది కావచ్చు

# పరిశ్రమది కాదు!

### హీరోయిన్ల చిత్రీకరణపై నటి అమలా పాల్ కీలక వ్యాఖ్యలు

కొచ్చి, సెప్టెంబర్ 30 : సినిమాల్లో హీరోయిన్లను అభ్యంతరకరంగా చిత్రీకరిస్తున్నారనే విమర్శలపై ప్రముఖ నటి అమలా పాల్ స్పందించారు. కొన్ని సినిమాల్లో మహిళా పాత్రలను చూపించే తీరును ఆధారంగా చేసుకుని మొత్తం చిత్ర పరిశ్రమను నిందించడం సరికాదని అభిప్రాయపడ్డారు. అలాంటి చిత్రీకరణకు ఆయా సినిమాల దర్శకులు, చిత్రబృందాల ఆలోచనా విధానమే కారణమవుతుందని పేర్కొన్నారు.

కొచ్చిలో జరిగిన 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్--2026'లో పాల్గొన్న అమలా పాల్.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో కథానాయికల పాత్రలు, మహిళా ప్రాధాన్య సినిమాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రతి చిత్ర పరిశ్రమ నుంచి మంచి మహిళా ప్రాధాన్య కథలు వస్తున్నాయని, అందువల్ల ఏదో ఒక సినిమాలో మహిళా పాత్రను చూపించిన తీరును మొత్తం పరిశ్రమకు ఆపాదించడం తగదన్నారు. "మొత్తం పరిశ్రమను నిందించాలని నేను అనుకోవడం లేదు. సమస్య ఉంటే అది ఒక సినిమాకు లేదా ఆ దర్శకుడి ఆలోచనా విధానానికి సంబంధించినదై ఉంటుంది. ఇప్పుడు ప్రతి పరిశ్రమలోనూ మహిళలకు ప్రాధాన్యమున్న మంచి సినిమాలు వస్తున్నాయి" అని అమలా పాల్ పేర్కొన్నారు. దాదాపు 15 ఏళ్ల సినీ ప్రయాణంలో తాను మూసధోరణి పాత్రలకు భిన్నంగా ఉండే కథలను ఎంచుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. 2019లో వచ్చిన 'ఆడై'లో తాను పోషించిన పాత్రను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. తెలుగులో ఈ చిత్రం 'ఆమె' పేరుతో విడుదలైంది. 'ఆడై'లో నటించే సమయంలో తన సినీ జీవితంపై ఆ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్న భయం ఉండేదని అమలా పాల్ చెప్పారు. అలాంటి పాత్రలే వరుసగా వస్తాయే-మోనన్న ఆందోళన కూడా కలిగిందన్నారు. అయితే ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అది తన సినీ జీవితంలో తీసుకున్న అత్యంత ధైర్యమైన నిర్ణయాల్లో ఒకటిగా అనిపిస్తోందని తెలిపారు.

అదే సమయంలో ఇప్పుడు మళ్లీ 'ఆడై' తరహా సినిమా చేయమంటే బహుశా చేయలేనేమోనని వ్యాఖ్యానించారు. చిత్ర పరిశ్రమలో మహిళలు తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకునేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని, మహిళా ప్రాధాన్య కథలు పెరుగుతున్న తీరు భవిష్యత్తుపై మరింత ఆశ కలిగిస్తోందని అమలా పాల్ పేర్కొన్నారు.





# శ్రీలీల బాలీవుడ్ తెరంగేట్రానికి ముహూర్తం ఎప్పుడు?

టాలీవుడ్ ముద్దుగుమ్మ శ్రీలీల బాలీవుడ్‌లో ఎంత త్వరగా ఇంట్రడ్యూసై కెరీర్ బిల్డ్ చేసుకుందామా అనుకుంటే అంతంత వెనక్కు వెళుతోంది డెబ్యూ ఫిల్మ్. 2024లో మొదలు పెట్టిన మ్యూజికల్ లవ్ స్టోరీ ఇప్పటికీ పూర్తి కాలేదు. కార్తీక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు దర్శకత్వంలో తెరకెక్కుతోన్నఈ మూవీని గత ఏడాది దీపావళికే తీసుకొస్తామన్నారు కానీ ఈ ఏడాది దీపావళికి కూడా వచ్చేట్లుగా లేదు. కార్తీక్ ఆర్యన్ ఇతర కమిట్మెంట్స్ వల్ల ఈ సినిమా షూట్ పోస్ట్ పోన్ అవుతూ వస్తుంది. ఇటీవల కబీర్ ఖాన్ సినిమా షూటింగ్‌లో కార్తీక్ ఆర్యన్ గాయపడంతో షూటింగ్స్‌కు బ్రేక్ ఇచ్చాడు. కోలుకుని తిరిగి వచ్చాక.. అనురాగ్ బసు మూవీ షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్ అండ్ శ్రీలీలపై సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాడు డైరెక్టర్. తు మేరీ జిందగీ హై టైటిల్ పరిశీలనలో ఉన్న ఈ మూవీ ఈ ఏడాది కూడా రిలీజ్ కావడం కష్టమేనన్న టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ ప్రాజెక్ట్ వల్ల వైరల్ వయ్యారీ కూడా అజిత్ మూవీని వదిలేసుకున్నట్లు టాక్. అజిత్64వ మూవీకి శ్రీలీల ఫిక్సైంది. డేర్ డెవిల్ నవంబర్ 2 నుండి షూటింగ్ మొదలు కానుంది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీలో డ్యాన్సింగ్ క్వీన్ ప్లేసులోకి ఆషికా రంగనాథ్ నేమ్ పరిశీలిస్తున్నట్లు బాలీవుడ్ బజ్. ఇక ధనుష్‌తో నటిస్తున్న ఓమ్ దసరా రేసు నుండి తప్పుకున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో వరుస ఫ్లాప్స్ టేస్ట్ చేయడంతో వైరల్ వయ్యారీని లైట్ తీసుకుంటున్నారు మేకర్స్.

## విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న

# 'ది ప్యారడైజ్' టీమ్!

**విజయవాడ, సెప్టెంబర్ 30** : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని టాలీవుడ్ నేచురల్ స్టార్ నానితో పాటు 'ది ప్యారడైజ్' చిత్ర యూనిట్ దర్శించుకున్నారు. సినిమా సక్సెస్ కావడంతో పాటు, ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనకు కృతజ్ఞతగా టీమ్ అంతా కలిసి విజయవాడకు పయనమయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఈ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ యాక్షన్ డ్రామా ఇటీవల భారీ అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన మొదటి రోజు నుంచి బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. తొలి రోజే రూ.80 కోట్లకు పైగా వసూలు చేసి నాని కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా 'ది ప్యారడైజ్' సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం ఈ సినిమా రూ.200 కోట్ల క్లబ్ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో విజయవాడ చేరుకున్న నానికి ఆలయ అధికారులు మరియు వేద పండితులు ఘన స్వాగతం పన్నారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరియు చిత్ర బృందం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు నానికి వేదాశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రాలు మరియు తీర్థప్రసాదాలను బహూకరించారు. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ కథానాయకిగా నటించగా, మోహన్ బాబు, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు తదితరులు కీలక పాత్రల్లో తమ నటనతో ప్రేక్షకులను అలరించారు.





Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com